కుంటి సాకులను
ఆమోదించం

7

వార్తసంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు...

రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు
2027 ముప్పు

5

Published From : Rangareddy VOLUME : 01 Issue : 295 Thursday 15-10-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

సింగరేణి కార్మికులు తిరగబడితే దక్షిణాది రాష్ట్రాలు చీకట్లోనే!

- తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులది కీలక పాత్ర
- 42 రోజుల సమ్మెతో బొగ్గు ఉత్పత్తి నిలిపివేత
- కేసీఆర్‌కు అండగా నిలిచిన కార్మిక లోకం
- బొగ్గు ఉత్పత్తిలోనే కాదు.. ఉద్యమాల్లోనూ ముందంజ
- కార్మికుల త్యాగాలను మరిచిపోలేం
- సింగరేణి కార్మికుల పోరాట స్ఫూర్తికి వందనం
- గోదావరిఖని గడ్డ పోరాటాలకు ప్రతీక
- సింగరేణి కార్మిక గర్జన సభలో కేటీఆర్

గోదావరిఖని

సింగరేణి కార్మికులు సమ్మెకు దిగితే దక్షిణాది రాష్ట్రాలే చిమ్మచీకట్లో ఉండిపోయే పరిస్థితి ఉండేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులు పోషించిన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. గోదావరిఖనిలోని సింగరేణి స్టేడియంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో ఆయన మాట్లాడారు. పోరాటాల పురిటిగడ్డ రామగుండం అని, నల్లబంగారు గనుల్లో చెమటోడ్చి దేశానికి విద్యుత్ వెలుగులు అందిస్తున్న కార్మికులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. సింగరేణికి 137 ఏళ్ల చరిత్ర ఉందని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ సంస్థ అభివృద్ధి వెనుక వేలాది మంది కార్మికుల శ్రమ, త్యాగాలు ఉన్నాయని చెప్పారు. బొగ్గు గనుల్లో పనిచేస్తూ -మిగతా 2 లో

మళ్లీ నిరసనలకు సీజేపీ పిలుపు

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ వద్ద కార్యక్రమం
- జాతీయ జెండాలతో రావాలని అభిజీత్ దీప్కే పిలుపు
- నేతలు జైలులో ఉండటంపై ప్రభుత్వంపై విమర్శలు
- తిరంగా ఊపడం నేరమా అంటూ ప్రశ్న
- ఢిల్లీకి రాలేనివారు స్వస్థలాల్లోనే నిరసనలు చేయాలని సూచన
- సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు తిహార్ జైలులో

02

అక్టోబర్ 16న 'లెహ్రా దో తిరంగా' పేరుతో ఆందోళన

సీఈసీ రాజీనామా డిమాండ్‌తో మరోసారి ఆందోళనకు సీజేపీ సిద్ధమైంది. 'లెహ్రా దో తిరంగా' పేరుతో అక్టోబర్ 16న ఢిల్లీలో భారీ నిరసన చేపట్టనున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. జాతీయ జెండా ఊపడం నేరమా? అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని, ఢిల్లీ పోలీసులను ప్రశ్నించారు. ఢిల్లీకి రాలేని మద్దతుదారులు తమ ప్రాంతాల్లోనూ తిరంగా మార్చ్ నిర్వహించాలని పిలుపునిచ్చారు.

యువతే పారిశ్రామిక శక్తి!

తెలంగాణను అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- యువ పారిశ్రామికవేత్తలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహం
- పెరి అర్బన్ ప్రాంతాన్ని తయారీ రంగ కేంద్రంగా అభివృద్ధి
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మారుస్తాం
- మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహం
- ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యం
- సమాఖ్య గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ 2026లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు యువత, మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే యువ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ హైటెక్స్‌లో సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమాఖ్య గ్లోబల్ బిజినెస్ సమ్మిట్--2026 ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. కొత్త తరాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు కృషి చేస్తున్న సమాఖ్య చాంబర్ -మిగతా 2 లో

02

రైల్వే ఉద్యోగులకు మోదీ సర్కారు శుభవార్త

- 78 రోజుల దసరా బోనస్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- 11.40 లక్షల మందికి పైగా ఉద్యోగులకు లబ్ధి
- బోనస్ కోసం రూ.2,009 కోట్లు కేటాయింపు
- ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ. 17,951 చెల్లింపు
- నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు వర్తింపు
- ట్రాక్‌మెన్ నుంచి లోకోపైలట్ల వరకు ప్రయోజనం

నట్టూ.. మళ్లీ సన్‌రైజర్స్‌కు!

- ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి నటరాజన్‌ను ట్రేడ్ చేసుకున్న హైదరాబాద్
- రూ.5 కోట్ల ధరతో పాత జట్టులోకి యార్కర్ కింగ్
- స్పిన్నర్ జీషన్ అన్సారీని ఢిల్లీకి ఇచ్చిన ఎస్ఆర్‌హెచ్

02

02

రైళ్లలో స్పీకర్ ఆన్ చేసి మొబైల్ చూస్తే

1,000 ఫైన్

- రైళ్లలో శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు రైల్వే శాఖ చర్యలు
- పెద్ద శబ్దంతో పాటలు వింటే, వీడియోలుచూస్తే ఇబ్బందులు
- తోటి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే జరిమానా
- హెచ్చరికలను పట్టించుకోకపోతే కఠిన చర్యలు
- కొన్ని సందర్భాల్లో ఆరు నెలల వరకు జైలు శిక్షకు అవకాశం

కేంద్రంలో అధికారం

కాంగ్రెస్‌దే!

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ ప్రధాని కావడం ఖాయం

- దసరాలోగా నామినేటెడ్ పోస్టుల భర్తీకి అవకాశం
- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌తో భారీ ర్యాలీ
- హైదరాబాద్‌లో 2 లక్షల మందితో బహిరంగ సభ
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై 23న సీఎంతో భేటీ
- కసీఆర్ కుటుంబం అక్రమాలను వెలుగులోకి తెస్తున్నాం
- మహిళా జర్నలిస్టులపై రాహుల్ వ్యాఖ్యల ప్రచారం అవాస్తవం
- గాంధీభవన్‌లో ఇష్టాగోష్టిగా మాట్లాడిన టీపీసీసీ చీఫ్

హైదరాబాద్,

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దసరా పండుగలోగా నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌తో దసరా తర్వాత హైదరాబాద్‌లో రెండు లక్షల మందితో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో ఇష్టాగోష్టిగా ఆయన మాట్లాడారు. -మిగతా 2 లో

02

బ్లూ డ్రమ్ హత్య కేసులో ముస్కాన్, సాహిల్‌కు

మరణశిక్ష

- మీరట్ జిల్లా కోర్టు సంచలన తీర్పు
- భర్త సౌరభ్‌ను హత్య చేసినట్లు నిర్ధారణ
- మృతదేహాన్ని ముక్కలుగా చేసి డ్రమ్‌లో దాచిన నిందితులు
- వివాహేతర సంబంధమే హత్యకు కారణమని అభియోగం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరైన నిందితులు
- గత సెప్టెంబర్ 30న ముగిసిన విచారణ
- 22 మందికి పైగా సాక్షుల విచారణ
- 13 నెలల్లోనే కేసు విచారణ పూర్తి

02

కాశీ ఆలయంలో బంగారం మాయం!

మహిళల ఆత్మగౌరవానికి

ప్రతీక బతుకమ్మ

- సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి
- మహిళలు ఇతరులపై ఆధారపడకుండా ఎదగాలి
- సమాజాన్ని శాసించే స్థాయికి చేరుకోవాలి
- బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క సందేశం
- గాంధీభవన్‌లో ఘనంగా సంబరాలు
- ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ
- భావితరాలకు సంప్రదాయాలను అందించాలి
- మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం

హైదరాబాద్,

తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో పండుగ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొని మహిళలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించడం తెలంగాణ మహిళలకు గర్వకారణమని అన్నారు. మహిళలు ఇతరులపై -మిగతా 2 లో

వార్తసంధ్య
www.vaarthasandhya.com

మళ్లీ నిరసనలకు సీజేపీ పిలుపు

-అక్టోబర్ 16న 'లెహ్రా దో తిరంగా' పేరుతో ఆందోళన
-సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
-ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ వద్ద కార్యక్రమం
-జాతీయ జెండాలతో రావాలని అభిజీత్ దీప్కే పిలుపు
-నేతలు జైలులో ఉండటంపై ప్రభుత్వంపై విమర్శలు
-తిరంగా ఊపడం నేరమా అంటూ ప్రశ్న
-ఢిల్లీకి రాలేనివారు స్వస్థలాల్లోనే నిరసనలు చేయాలని సూచన
-సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు తిహార్ జైలులో

న్యూఢిల్లీ:
ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మరోసారి నిరసనలకు సీజేపీ పిలుపునిచ్చింది. అక్టోబర్ 16న శుక్రవారం 'లెహ్రా దో తిరంగా' పేరుతో ఆందోళన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే బుధవారం ప్రకటించారు. జాతీయ జెండాను ఊపుతూ నిరసన తెలిపే ఈ కార్యక్రమాన్ని ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ వద్ద నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పాల్గొనేవారు జాతీయ జెండాలతో రావాలని కోరారు. తిరంగా జెండాను ఊపడం నేరమా అని దీప్కే ప్రశ్నించారు. జెండా ఎగురవేసినందుకే తమ పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను జైలులో పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఢిల్లీ పోలీసులు, కేంద్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఢిల్లీలో అనుమతి లేకుండా నిరసన నిర్వహించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించారనే ఆరోపణలపై సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టు వారికి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ప్రస్తుతం వారిద్దరూ తిహార్ జైలులో ఉన్నట్లు సమాచారం. వారిని వేర్వేరు గదుల్లో ఉంచినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.అక్టోబర్ 16న ఢిల్లీలో నిర్వహించే తిరంగా కార్యక్రమంలో మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని దీప్కే పిలుపునిచ్చారు. ఢిల్లీకి రాలేని వారు తమ సొంత ప్రాంతాల్లోనే జాతీయ జెండాలతో తిరంగా మార్చ్ నిర్వహించాలని సూచించారు. జెండాను ఊపడం నేరం కాదని నిరూపించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సీఈసీ రాజీనామా డిమాండ్‌తో సీజేపీ చేపడుతున్న నిరసనలను ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. గతంలో అనుమతులు, పోలీసు చర్యల కారణంగా పార్టీ కార్యక్రమాలకు ఆటంకాలు ఎదురయ్యాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా ఆందోళనకు ఎలాంటి స్పందన లభిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

సింగరేణి కార్మికులు తిరగబడితే దక్షిణాది రాష్ట్రాలు చీకట్లోనే!

మొదటి తరువాయి

ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు శాశ్వత వైకల్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలకు తెగించి చీకటి గుహల్లో పనిచేసే సింగరేణి కార్మికుల ధైర్యసాహసాలు అసాధారణమని కొనియాడారు. బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా ఉద్యమాల్లోనూ కార్మికులు ముందుంటారని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునకు సింగరేణి కార్మికులు పెద్ద ఎత్తున స్పందించారని కేటీఆర్ పేర్కొన్నారు. సకల జనుల సమ్మెలో భాగంగా ఒకసారి 35 రోజులు, మరోసారి ఏడు రోజులు కలిపి మొత్తం 42 రోజులపాటు కార్మికులు సమ్మె చేశారని గుర్తుచేశారు. ఆ సమయంలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోవడంతో దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన పోరాటానికి సింగరేణి కార్మికులు బలమైన మద్దతుగా నిలిచారని చెప్పారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సమయంలోనూ సింగరేణి కార్మికులు ఉద్యమంలో ముందుండి నడిచారని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ తెలంగాణ జెండా ఎత్తుకుని ముందుకు సాగితే, కార్మికులు ఆయనకు అండగా నిలిచారని అన్నారు. తెలంగాణ కోసం తమ ఉపాధి, రోజువారీ పనులను పక్కనపెట్టి పోరాడిన కార్మికుల త్యాగాలను ఎప్పటికీ మరిచిపోలేమని పేర్కొన్నారు. సాధారణంగా కార్మిక సంఘాలు వేతనాలు, బోనస్‌లు, హక్కుల కోసం పోరాడుతాయని కేటీఆర్ అన్నారు. అయితే తెలంగాణలోని సింగరేణి కార్మికులు తమ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించడం ప్రత్యేకమని పేర్కొన్నారు. గోదావరిఖని ప్రాంతం కార్మిక పోరాటాలకు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని చెప్పారు. సింగరేణి కార్మికుల కృషి, త్యాగాలు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

నట్టూ.. మళ్లీ సన్‌రైజర్స్‌కు!

- ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి నటరాజన్‌ను ట్రేడ్ చేసుకున్న హైదరాబాద్
- రూ.5 కోట్ల ధరతో పాత జట్టులోకి యార్కర్ కింగ్
- స్పిన్నర్ జీషన్ అన్సారీని ఢిల్లీకి ఇచ్చిన ఎస్‌ఆర్‌హెచ్



ముంబై
యార్కర్ కింగ్ టి. నటరాజన్ మళ్లీ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి వచ్చాడు. క్రికెట్ అభిమానులు ముద్దుగా 'నట్టూ' అని పిలుచుకునే ఈ లెఫ్టార్మ్ పేసర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి సన్‌రైజర్స్ ట్రేడ్ చేసుకుంది. అతడికి బదులుగా స్పిన్నర్ జీషన్ అన్సారీని ఢిల్లీ జట్టుకు అప్పగించింది. 2020 నుంచి 2024 వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన నటరాజన్ కీలక బౌలర్‌గా గుర్తింపు పొందాడు. తన పదునైన యార్కర్లతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందిపెట్టే నట్టూ, ఇప్పుడు మరోసారి పాత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. రూ.5 కోట్ల ధరతో అతడు సన్‌రైజర్స్‌లో చేరగా, జీషన్ అన్సారీ తన కనీస ధర రూ.40 లక్షలకే ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడనున్నాడు.

మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

మొదటి తరువాయి

ఆధారపడే స్థితి నుంచి ఎదిగి, సమాజాన్ని శాసించే స్థాయికి చేరుకోవాలన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్ష అని తెలిపారు. మహిళల సాధికారత, ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ పూర్వీకులు అందించిన గొప్ప సాంస్కృతిక వారసత్వమని మంత్రి పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, చెరువులను పూజిస్తూ, రంగురంగుల పూలతో అమ్మవారిని కొలవడం ఈ పండుగ ప్రత్యేకత అని వివరించారు. ఆడబిడ్డ అమ్మగారింటికి వచ్చి కుటుంబ సభ్యులతో ఆత్మీయతను పంచుకుంటూ ఆటపాటలతో ఆనందంగా గడిపే అపురూపమైన వేడుక బతుకమ్మ అని అన్నారు. తెలంగాణలోనే కాకుండా దేశవిదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ మహిళలు సైతం బతుకమ్మను ఘనంగా జరుపుకోవడం మన సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని సీతక్క తెలిపారు. ఆస్తులు కోల్పోతే తిరిగి సంపాదించుకోవచ్చని, పదవులు పోతే మళ్లీ పొందవచ్చని, కానీ కనుమరుగైన సంస్కృతి సంప్రదాయాలను తిరిగి తీసుకురావడం కష్టమని అన్నారు. పూర్వీకులు అందించిన ఆటపాటలు, సంప్రదాయాలే మహిళలకు గొప్ప ఆస్తులని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి పిలుపునిచ్చారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, వారి కోసం ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నామని వెల్లడించారు. బతుకమ్మ వంటి పండుగలు మహిళల్లో ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెబుతాయని సీతక్క అన్నారు.

యువతే పారిశ్రామిక శక్తి!

మొదటి తరువాయి

ఆఫ్ కామర్స్‌ను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాంకేతిక మార్పులు, నూతన విధానాలు, చట్టాలపై యువతకు అవగాహన ఉండాలని సీఎం సూచించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విధానాలతో పాటు అంతర్జాతీయ పరిణామాలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ రంగాల్లో అనుభవం ఉన్నవారిని ఒకే వేదికపై కలుసుకునే అవకాశం ఇలాంటి సదస్సుల ద్వారా లభిస్తుందని, వారి అనుభవాలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు పారిశ్రామిక, రాజకీయ, న్యాయ, సినీ రంగాల్లో సాధించిన విజయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడం ద్వారా యువతకు స్ఫూర్తినివ్వవచ్చని పేర్కొన్నారు. భారతదేశానికి 2047 సంవత్సరం ఎంతో కీలకమని రేవంత్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి దేశం సాధించిన ప్రగతిని సమీక్షించుకోవడంతో పాటు భవిష్యత్ లక్ష్యాలను సాధించేందుకు స్పష్టమైన ప్రణాళికలు అవసరమని చెప్పారు. భారత్‌ను 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న వికసిత్ భారత్--2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం 2025లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్--2047 గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర అభివృద్ధికి నిర్దిష్ట లక్ష్యాలను రూపొందించి, విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసిందని సీఎం తెలిపారు. రాష్ట్రాన్ని మూడు ప్రాంతీయ ఆర్థిక విభాగాలుగా విభజించి, ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, జనాభా, వనరులకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని సుమారు 2,100 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో 1.34 కోట్ల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)ను గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని కలిగించే పరిశ్రమలను ఓఆర్‌ఆర్ వెలుపలికి తరలించి, నగరంలో సేవల రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. పరిశ్రమల తరలింపునకు అవసరమైన రాయితీలు, అనుమతులు, ఇతర సహకారం అందించేందుకు హిల్ట్ విధానాన్ని తీసుకొచ్చామని వివరించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఓఆర్‌ఆర్ కీలక పాత్ర పోషించిందని సీఎం అన్నారు. మెరుగైన రవాణా సౌకర్యాల వల్ల ఐటీ, ఔషధ, విద్య, సేవల రంగాలు విస్తరించి నగరం నాలెడ్జ్ హబ్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. ఇదే తరహాలో ఓఆర్‌ఆర్ వెలుపల సుమారు 50 కిలోమీటర్ల పరిధిలో 360 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఓఆర్‌ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ మధ్య ఉన్న సుమారు 10,500 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్)గా గుర్తించి, తయారీ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ ప్రాంతంలో స్టార్టప్‌లు, కొత్త పరిశ్రమలు స్థాపించేందుకు యువ పారిశ్రామికవేత్తలకు విస్తృత అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఆర్‌ఆర్‌ఆర్ నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న సుమారు లక్ష చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని గ్రామీణ వ్యవసాయ ఆర్థిక ప్రాంతంగా (రేర్) అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలంటే ప్రణాళికలతో పాటు వాటి అమలుకు అవసరమైన పెట్టుబడులు, కార్యాచరణ కీలకమని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని, పెట్టుబడులు పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్‌ను తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతర్జాతీయ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్న భారతీయులు సొంతంగా స్టార్టప్‌లు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా మహిళల భాగస్వామ్యం పెరిగిన దేశాలు ఆర్థికంగా పురోగమిస్తున్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భారత్‌లోనూ మహిళల పారిశ్రామిక భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. యువత, మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే పారిశ్రామిక రంగంలో రాష్ట్రం మరింత పురోగతి సాధిస్తుందని చెప్పారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

రైళ్లలో స్పీకర్ ఆన్ చేసి మొబైల్ చూస్తే 1,000 ఫైన్

రైళ్లలో శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు రైల్వే శాఖ చర్యలు
పెద్ద శబ్దంతో పాటలు వింటే, వీడియోలు చూస్తే ఇబ్బందులు
తోటి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే జరిమానా
హెచ్చరికలను పట్టించుకోకపోతే కఠిన చర్యలు
కొన్ని సందర్భాల్లో ఆరు నెలల వరకు జైలు శిక్షకు అవకాశం

హైదరాబాద్,
రైలు ప్రయాణాల్లో తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు రైల్వే శాఖ చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. ఇకపై రైళ్లలో మొబైల్ ఫోన్ స్పీకర్ ఆన్ చేసి పెద్ద శబ్దంతో పాటలు వినడం, వీడియోలు చూడటం, ఫోన్‌లో గట్టిగా మాట్లాడటం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించి ఇతర ప్రయాణికులకు అసౌకర్యం కలిగించే వారిపై రూ.1,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. ర్ళైలో ప్రయాణించే సమయంలో కొందరు మొబైల్ ఫోన్లలో పెద్ద శబ్దంతో పాటలు వినడం, వీడియోలు చూడటంతో ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ తరహా ఘటనలపై ఫిర్యాదులు పెరుగుతుండటంతో రైల్వే అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణికుల నిద్రకు భంగం కలగకుండా చూడటంపై దృష్టి సారిస్తున్నారు. హెచ్చరికలు చేసినప్పటికీ నిబంధనలు ఉల్లంఘిస్తే పరిస్థితిని బట్టి మరింత కఠినమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. ఇండియన్ రైల్వేస్ చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం కొన్ని సందర్భాల్లో ఆరు నెలల వరకు జైలు శిక్ష, రూ.5,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. రైల్వే స్టేషన్లలోనూ శబ్దానికి సంబంధించిన నిబంధనలను అమలు చేయనున్నట్లు సమాచారం. ప్రయాణికులు మొబైల్ ఫోన్లలో పాటలు వినాలన్నా, వీడియోలు చూడాలన్నా ఇయర్‌ఫోన్లు లేదా హెడ్‌ఫోన్లు ఉపయోగించాలని రైల్వే అధికారులు సూచిస్తున్నారు. ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా తక్కువ శబ్దంతో మాట్లాడి ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని కోరుతున్నారు.

కాశీ ఆలయంలో బంగారం మాయం!

వారణాసి
అయోధ్య రామాలయంలో కానుకలు, నిధుల అవకతవకలపై అభాసుపాలైన యూపీ బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు కాశీ విశ్వనాథ ఆలయంలోనూ అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలోని ప్రసిద్ధ కాశీ విశ్వనాథుని ఆలయంలో బంగారం చోరీకి గురైందంటూ ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. వారణాసి బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది నిత్యానంద్ రాయ్ ఈ విషయమై ప్రధానమంత్రి కార్యాలయానికి(పీఎంఓ) లేఖ రాశారు. ఆలయ శిఖరంతో పాటు, పలు ప్రాంతాల్లో బంగారం కనిపించడం లేదని, ఆలయ యాజమాన్యం ఆ ప్రదేశాలకు రంగులు వేసి, విషయాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు.

బ్లూ డ్రమ్ హత్య కేసులో ముస్కాన్, సాహిల్‌కు మరణశిక్ష

ముంబై
: దేశంలో సంచలనం సృష్టించిన మీరట్, బ్లూడ్రమ్ మర్డర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితులు ఇద్దరికీ మరణశిక్ష విధిస్తూ మీరట్‌కు చెందిన జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. ఈ మేరకు జిల్లా కోర్టు జడ్జి అరవింద్ కుమార్ మిశ్రా తీర్పు వెలువరించారు. ఈ కేసు విచారణ గత సెప్టెంబర్ 30న పూర్తికాగా.. నిందితులు ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా నేరానికి పాల్పడ్డట్లు తేలింది.దీంతో ఆరోజు తీర్పు రిజర్వ్ చేయగా, నేడు తీర్పు వెల్లడించారు. ఈ ఘటనలో హత్యకు గురైంది రస్తోగి భర్త సౌరభ్ భరద్వాజ్. తీర్పు వెలువడుతున్న సమయంలో జిల్లా జైలులో ఉన్న నిందితులు ఇద్దరూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. బ్లూ డ్రమ్ హత్యకు సంబంధించిన పూర్తి వివరాలివి. ఉత్తర ప్రదేశ్, మీరట్‌కు చెందిన నేవీ మాజీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్.. 2025, మార్చి 3న హత్యకు గురయ్యాడు. అతడి భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా కలిసి సౌరభ్‌ను హత్య చేశారు. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో సౌరభ్‌ను హత్య చేశారు. అనంతరం అతడి మృతదేహాన్ని ముక్కలుగా చేసి, ఒక బ్లూ డ్రమ్‌లో ఉంచారు. పైనుంచి సిమెంట్ పోసి, కప్పేశారు. దీంతో అతడి మృతదేహం అందులోనే కూరుకుపోయింది. ఘటన జరిగిన కొన్ని రోజులకు పోలీసులు అన్ని కోణాల్లో విచారించగా ఈ హత్య ఘటన బయటపడింది. సౌరభ్‌ను ముస్కాన్, ఆమె క్లాస్‌మేట్, ప్రియుడు సాహిల్ కలిసి హత్య చేసినట్లు తేలింది. దీనిపై గత ఏడాది జూలైలో విచారణ ప్రారంభమైంది. మొత్తం 13 నెలల్లోనే ఈ కేసు విచారణ పూర్తై, తీర్పు వెలువడటం విశేషం. ఈ కేసులో 126 వాదోపవాదాలు జరిగాయి.

రైల్వే ఉద్యోగులకు మోదీ సర్కారు శుభవార్త

-78 రోజుల దసరా బోనస్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
-11.40 లక్షల మందికి పైగా ఉద్యోగులకు లబ్ధి
-బోనస్ కోసం రూ.2,009 కోట్లు కేటాయింపు
-ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 చెల్లింపు
-నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు వర్తింపు
-ట్రాక్‌మెన్ నుంచి లోకోపైలట్ల వరకు ప్రయోజనం

ముంబై
రైల్వే శాఖ ఉద్యోగులకు మోదీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం శుభవార్త అందించింది. రైల్వే ఉద్యోగులకు 78 రోజుల దసరా బోనస్ ప్రకటిస్తూ మోదీ క్యాబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుంది. ఈ బోనస్ మొత్తం విలువ రూ.2,009 కోట్లుగా ఉంది. పీఎల్‌బీ (ప్రొడక్టివిటీ లింకుడ్ బోనస్) కింద ఉద్యోగులకు ఈ మొత్తం రైల్వే శాఖ చెల్లించనుంది. ఈ నిర్ణయం ద్వారా 11,40,770 మంది రైల్వే నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.ప్రతి ఏడాది దసరా సందర్భంగా రైల్వే ఉద్యోగులకు కేంద్రం బోనస్ ప్రకటిస్తుంటుంది. ఈ ఏడాది 78 రోజుల బోనస్ ప్రకటించింది. ఒక ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 వరకు అందుతాయి. 78 రోజుల బోనస్ అయినప్పటికీ.. చెల్లింపులపై పరిమితి వల్ల ఈ మొత్తం తక్కువగా ఉంటుంది. దీనిద్వారా ట్రాక్ మెయింటెనర్స్, స్టేషన్ మాస్టర్స్, ట్రైన్ మేనేజర్లు, టెక్నీషియన్లు, లోకోపైలట్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్ హెల్పర్లు, మినిస్టీరియల్ స్టాఫ్, పాయింట్‌మ్యాన్‌తోపాటు ఇతర గ్రూప్-సి సిబ్బందికి బోనస్ అందుతుంది. బోనస్ ప్రకటన సందర్భంగా కేంద్ర క్యాబినెట్ కీలక వ్యాఖ్యలు చేసింది. 2025-26 రైల్వే శాఖకు చాలా మంచి సమయం అని, ఈ సమయంలో రైల్వే శాఖ 1,670 మిలియన్ టన్నుల కార్గోను రవాణా చేసిందని తెలిపింది. అలాగే, ఇదే కాలంలో 7.41 బిలియన్ల మంది ప్రయాణికులు రైళ్లో ప్రయాణించారు. ఇక, ఫేక్ బోనస్ లెటర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని రైల్వే బోర్డు సంబంధిత ఉద్యోగులకు సూచించింది. మరోవైపు తమకు డీఏ పరిమితిని గరిష్టంగా రూ.18,000 నుంచి పెంచాల్సిందిగా ఇండియన్ రైల్వేస్ టెక్నికల్ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ ఇటీవల ప్రభుత్వాన్ని కోరింది. లెవల్2, ఆపై ఉద్యోగులకు వర్తించేలా చూడాలని కోరింది.

కేంద్రంలో అధికారం కాంగ్రెస్‌దే!

మొదటి తరువాయి

రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోందని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికల వ్యూహంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీ తరహాలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనూ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్ సూచించినట్లు పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులను రాహుల్‌గాంధీ అవమానించారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. మహిళలు, పెద్దల పట్ల రాహుల్‌కు ఎంతో గౌరవం ఉందని అన్నారు. గతంలో మల్లికార్జున ఖర్గేకు షూలేస్ కట్టుకునేందుకు ఇబ్బంది ఎదురైనప్పుడు రాహుల్ స్వయంగా సహాయం చేశారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును అడ్డుకోవడం సరికాదని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా ఎవరైనా పోరాటం చేస్తే కాంగ్రెస్ మద్దతు ఉంటుందని ప్రకటించారు. కేసీఆర్ కుటుంబానికి చెందిన ఫాంహౌస్‌లపై దాడులు చేయడం తమ ఉద్దేశం కాదని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తాము నీతిమంతులమని చెప్పుకునే నాయకుల వ్యవహారాలను ప్రజల ముందు ఉంచేందుకే ఫాంహౌస్‌ల అంశాన్ని ప్రస్తావిస్తున్నామని అన్నారు. అయోధ్య రామమందిరం భూమిపూజకు సంబంధించిన చరిత్రను గుర్తుచేస్తూ, ఆ అంశాన్ని బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లిందని, సంపన్నులకే ఎక్కువ ప్రయోజనాలు కలుగుతున్నాయని ఆరోపించారు. సింగరేణి కార్మికుల అంశంపై బీఆర్‌ఎస్ చేస్తున్న విమర్శలను ఆయన తప్పుబట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వం కార్మికులకు ప్రయోజనాలు కల్పిస్తోందని చెప్పారు. ఎల్‌నినో అనేది ప్రకృతి సంబంధిత పరిణామమని, ప్రపంచవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. ప్రతి అంశాన్నీ రాజకీయాలకు ఉపయోగించుకోవడం బీఆర్‌ఎస్‌కు తగదని హితవు పలికారు. బీజేపీకి వ్యతిరేకంగా యువత చేపడుతున్న పోరాటాలు చారిత్రాత్మకమని మహేష్‌కుమార్ గౌడ్ ప్రశంసించారు. కాంగ్రెస్, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు ప్రజా సమస్యలపై తమదైన రీతిలో పోరాడుతున్నాయని తెలిపారు. ఆర్టీసీలో 15 ఏళ్లుగా గుర్తింపు సంఘం ఎన్నికలు జరగలేదని, అందుకే తమ ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ముందుకొచ్చిందని చెప్పారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ఓటమి పాలైనంత మాత్రాన నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, గెలుపోటములు సహజమని వ్యాఖ్యానించారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

బోధన్‌లో కల్తీ నూనె తయారీ గుట్టురట్టు..

900 లీటర్లు స్వాధీనం!

-పశువుల కొవ్వు, ఎముకలు, తోళ్లతో నూనె తయారు చేస్తున్నారన్న సమాచారంతో పోలీసుల దాడి

-ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నిజామాబాద్, అక్టోబర్ 14 (వార్త సంధ్య):
నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని గాంధీనగర్‌లో అక్రమంగా నూనె తయారు చేస్తున్నారన్న సమాచారంతో చీతా ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పశువుల కొవ్వు, ఎముకలు, తోళ్లను ఉపయోగించి నూనె తయారు చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో చేపట్టిన ఈ దాడిలో సుమారు 900 లీటర్ల నూనెను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మహమ్మద్ సఫీ ఉద్దీన్, మహమ్మద్ సోఫిఉద్దీన్, అబ్దుల్ అన్వర్‌లను అదుపులోకి తీసుకున్నారు. అక్రమ నూనె తయారీకి సంబంధించిన సమాచారాన్ని అందుకున్న చీతా ఫోర్స్, బోధన్ పోలీసులు గాంధీనగర్‌లో తనిఖీలు చేపట్టి నూనెను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో చీతా ఫోర్స్ ఎస్ఐ శ్రీను, బోధన్ ఎస్ఐ రామ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ విషయాన్ని బోధన్ సీఐ వెంకటనారాయణ వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న నూనె స్వభావం, దాని తయారీలో ఉపయోగించిన పదార్థాలు, అది ఏ అవసరాలకు వినియోగించేందుకు సిద్ధం చేశారనే అంశాలపై సంబంధిత అధికారులు పరీక్షలు నిర్వహించి నిర్ధారించాల్సి ఉంది. ఆహార పదార్థాలుగా వినియోగించే నూనె అయితే ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలు కూడా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ ఘటనపై పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కోట మైసమ్మ దేవస్థానానికి ఎయిర్ కూలర్, ఇనుప బీరువా విరాళం

-రూ.5,050 నగదు అందజేసిన భక్త దంపతులు

సింగరేణి ప్రతినిధి , అక్టోబర్ 14(వార్త సంధ్య)
ఉసిరికాయపల్లి గ్రామంలోని శ్రీ కోట మైసమ్మ అమ్మవారి దేవస్థానానికి భక్త దంపతులు ఎయిర్ కూలర్, ఇనుప బీరువాతో పాటు నగదు విరాళాన్ని అందజేశారు. మహబూబాబాద్ జిల్లా పెద్దగూడూరు మండలం అయోధ్యపురం గ్రామానికి చెందిన అమ్మవారి పరమ భక్తులు తూర్పాటి ఏకాంబరం, మమత దంపతులు దేవస్థాన సేవార్థం ఒక ఎయిర్ కూలర్, ఒక ఇనుప బీరువాను బహుకరించారు. వీటితో పాటు రూ.5,050 నగదును విరాళంగా అందజేసి అమ్మవారిపై తమకున్న భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఈ సందర్భంగా దాతలు విరాళంగా అందించిన వస్తువులు, నగదును దేవస్థాన చైర్మన్ పర్స పట్టాభిరామరావు, కార్యనిర్వహణాధికారి (ఈఓ) కె. వెంకటయ్యలకు అందజేశారు. భక్తులు అందించిన విరాళాల పట్ల దేవస్థాన కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ దాతల సేవాభావాన్ని అభినందించారు. శ్రీ కోట మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు దాతల కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

సింగరేణి మండల ఎంఆర్పీఎస్ ప్రధాన కార్యదర్శిగా రాయల శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక

అట్టడుగు వర్గాల హక్కుల సాధనకు కృషి చేస్తా: రాయల శ్రీనివాస్

సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 14 (వార్త సంధ్య):
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) సింగరేణి మండల నూతన ప్రధాన కార్యదర్శిగా రాయల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ఎంఆర్పీఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ఎన్నికను ప్రకటించారు. సామాజిక న్యాయం, అట్టడుగు వర్గాల అభ్యున్నతి, ఎస్సీ వర్గాల హక్కుల పరిరక్షణ కోసం రాయల శ్రీనివాస్ చేస్తున్న కృషిని గుర్తించి ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు సంఘం నాయకులు తెలిపారు. నూతన బాధ్యతలతో సంఘాన్ని మండలంలో మరింత బలోపేతం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం
ఈ సందర్భంగా నూతన ప్రధాన కార్యదర్శి రాయల శ్రీనివాస్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ఎంఆర్పీఎస్ నాయకులు, పెద్దలు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. సంఘం ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, నాయకులు, కార్యకర్తల సహకారంతో ఎంఆర్పీఎస్‌ను మరింత పటిష్ఠం చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం నూతన ప్రధాన కార్యదర్శి రాయల శ్రీనివాస్‌ను పలువురు ఎంఆర్పీఎస్ నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కాప్రా చెరువు అవుట్‌లెట్

పనులకు మరో రూ.7 కోట్లు!

-వర్షాకాలంలోపు పనులు పూర్తి చేయాలి: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

- వరద ముంపు నుంచి పలు కాలనీలకు విముక్తి కల్పించడమే లక్ష్యం

-నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం: జోనల్ కమిషనర్ వికాస్ మహతో

హైదరాబాద్, తేదీ (వార్త సంధ్య):
బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని హరిహరపురం కాలనీలో కాప్రా చెరువు అవుట్‌లెట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే వర్షాకాలంలోపు పూర్తి చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అధికారులను కోరారు. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే రూ.5 కోట్ల నిధులు మంజూరు కాగా, మిలేనియం కాలనీ నుంచి కాప్రా చెరువు వరకు చేపట్టాల్సిన మిగిలిన పనులకు మరో రూ.7 కోట్ల నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

కుమ్మరికుంట నుంచి మిలేనియం కాలనీ వరకు పనులు
కాప్రా చెరువు అవుట్‌లెట్ నిర్మాణంలో భాగంగా కుమ్మరికుంట నుంచి మిలేనియం కాలనీ వరకు ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. ఈ పనుల కోసం గతంలో రూ.5 కోట్ల నిధులు మంజూరు చేశారు. మిలేనియం కాలనీ నుంచి కాప్రా చెరువు వరకు మిగిలిన పనులను పూర్తి చేయడానికి సుమారు రూ.7 కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ నిధుల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పనులను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కోరారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన
కాప్రా చెరువు పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జోనల్ కమిషనర్ వికాస్ మహతోతో కలిసి పర్యటించి అవుట్‌లెట్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. మిగిలిన పనులకు అవసరమైన రూ.7 కోట్లను మంజూరు చేయించి, నిర్మాణాన్ని వేగవంతం చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. వచ్చే వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తి చేస్తే దిగువ ప్రాంతాల్లోని కాలనీల ప్రజలకు వరద ముంపు సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని వివరించారు.

పలు కాలనీలకు వరద ముప్పు తగ్గే అవకాశం
కాప్రా చెరువు అవుట్‌లెట్ నిర్మాణ పనులు పూర్తయితే శాతవాహన నగర్, సాయి గార్డెన్, గాంధీనగర్, గాంధీనగర్ సౌత్, స్నేహమయి నగర్, అఖిలాండేశ్వరి నగర్, పీవీఆర్ కాలనీ, సామానగర్‌తో పాటు ఇతర కాలనీలకు వరద ముంపు ముప్పు తగ్గే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు సక్రమంగా బయటకు వెళ్లేందుకు అవసరమైన వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ప్రతి వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించవచ్చని భావిస్తున్నారు.

త్వరలో పనులు పూర్తి చేస్తాం: జోనల్ కమిషనర్
ఎమ్మెల్యే విజ్ఞప్తిపై జోనల్ కమిషనర్ వికాస్ మహతో స్పందిస్తూ, అదనపు నిధుల కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. నిధుల మంజూరు ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులను ముందుకు తీసుకెళ్లి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటిక రెడ్డి అరవింద రెడ్డి, అనిల్ చౌదరి, రాఘవేంద్రరావు, పోగుల రాంబాబు, సందీప్‌తో పాటు వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్ డంపింగ్ యార్డ్ దుర్వాసనపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పర్యటన!

హైదరాబాద్, తేదీ (వార్త సంధ్య):
ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, వ్యర్థ రసాయనాలు, మురుగునీటితో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతోతో కలిసి ఈరోజు డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభావిత కాలనీల ప్రజలు ప్రతిరోజూ డంపింగ్ యార్డ్ నుంచి తీవ్రమైన దుర్వాసన వెలువడుతోందని, ముఖ్యంగా వర్షాలు పడినప్పుడు వ్యర్థాలు, మురుగునీటి కారణంగా దుర్గంధం మరింత పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న రక్తం, కొవ్వు పదార్థాలు, ఇతర వ్యర్థాలతో పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయని, 60 ఏళ్లు పైబడిన వృద్ధులు సహా స్థానికులు శ్వాస సంబంధిత ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో వాహనాల ద్వారా వ్యర్థాలను రోడ్లపైనే పడేస్తున్నారని, అటువంటి వాహనాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో సుమారు రూ.6 కోట్లతో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. వివిధ ప్రాంతాల నుంచి ట్యాంకర్లలో వ్యర్థ రసాయనాలను తీసుకొచ్చి డంపింగ్ యార్డ్ ప్రాంతంలో వదులుతున్నారనే ఫిర్యాదులు అందడంతో అప్పటి అధికారులతో మాట్లాడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. అక్రమంగా చెత్తను తరలించి పడేస్తున్న లారీలను గుర్తించి భారీ జరిమానాలు విధించినట్లు వివరించారు. గతంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, అటవీ శాఖ, ఇతర సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అక్కడ నిల్వ ఉన్న మురుగునీటిని తరలించేందుకు ట్యాంకర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జంతు కళేబరాలు, ఇతర వ్యర్థాలను పడేస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డ్ పరిసరాల్లో దుర్వాసన రాకుండా పర్యవేక్షణను బలోపేతం చేయడంతో పాటు మోటార్ల ద్వారా నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతంలోని కెమికల్, ఫర్టిలైజర్ గోదాములు, మెకానికల్ షెడ్లను తనిఖీ చేసి డ్రైనేజీ మార్గాల ద్వారా వ్యర్థాలు, రసాయనాలను విడుదల చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అక్కడ వాచ్‌మెన్‌ను నియమించడంతో పాటు ఎస్టీపీ ప్లాంట్ల నిర్మాణం కూడా చేపట్టామని, ఇప్పటివరకు సుమారు 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. డంపింగ్ యార్డ్ ప్రాంతంలో అక్రమంగా వ్యర్థాలను పడేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వచ్చే వాహనాలపై నిఘా పెట్టి, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను సీజ్ చేయడం లేదా భారీ జరిమానాలు విధించడం ద్వారా సమస్యను కొంతమేర అరికట్టవచ్చని సూచించారు. దీనిపై జోనల్ కమిషనర్ వికాస్ మహతో స్పందిస్తూ ఎమ్మెల్యే సూచనలను పరిగణనలోకి తీసుకొని తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రాత్రి వేళల్లో డంపింగ్ యార్డ్‌కు వచ్చే వాహనాలపై నిఘా ఏర్పాటు చేస్తామని, రాబోయే రోజుల్లో రోడ్ల పక్కన వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ విఠల్ రెడ్డి, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్ రెడ్డి, సంతోష్ గుప్తా, రవి, బాలరాజుతో పాటు డంపింగ్ యార్డ్ ప్రభావిత కాలనీల అధ్యక్షులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

కామారెడ్డి యశోద సెంటర్‌లో మీడియా సమావేశం

-సోమాజిగూడ యశోద హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ అంకాలజీ లాపరో స్కోపిక్ రోబోటిక్ అంకో సర్జన్ డాక్టర్ వై. యుగంధర్ రెడ్డి

-మినిమల్లీ ఇన్వేసివ్ విధానాలతో క్యాన్సర్ చికిత్సలో అత్యాధునిక పురోగతి

-౹రోబోటిక్, లాపరోస్కోపిక్ సర్జరీలతో మెరుగైన వైద్య సేవలు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 14:
యశోద హాస్పిటల్స్, సోమాజిగూడలో క్యాన్సర్ చికిత్సలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. సర్జికల్ పద్ధతుల్లో వస్తున్న ఆధునిక మార్పులతో క్యాన్సర్ రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు అవకాశం కలుగుతోందని పేర్కొన్నారు. క్యాన్సర్ శస్త్రచికిత్సలో మినిమల్లీ ఇన్వేసివ్ విధానాలు, లాపరోస్కోపిక్, రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ విధానాల ద్వారా చిన్న కోతలతో శస్త్రచికిత్స నిర్వహించడం, రక్తస్రావాన్ని తగ్గించడం, రోగులు త్వరగా కోలుకునేలా చేయడం సాధ్యమవుతుందని వైద్యులు వివరించారు. అవసరమైన సందర్భాల్లో అవయవాలను సంరక్షిస్తూ చికిత్స అందించడానికి కూడా ఈ విధానాలు తోడ్పడుతున్నాయని తెలిపారు. సాంప్రదాయ శస్త్రచికిత్సలతో పోలిస్తే ఆధునిక సాంకేతికతతో కూడిన చికిత్సలు రోగులకు అనేక ప్రయోజనాలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. రోగి ఆరోగ్య పరిస్థితి, క్యాన్సర్ దశ, వ్యాధి వ్యాప్తిని బట్టి తగిన చికిత్సా విధానాన్ని ఎంపిక చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ ఆంకో-సర్జన్ డాక్టర్ వై. యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక శస్త్రచికిత్సా విధానాలు క్యాన్సర్ చికిత్సలో కీలక మార్పులు తీసుకొస్తున్నాయని తెలిపారు. రోగులకు అవసరమైన చికిత్సను తక్కువ కోతలతో, ఖచ్చితత్వంతో అందించేందుకు ఈ సాంకేతికతలు ఉపయోగపడుతున్నాయని వివరించారు. సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల సమన్వయంతో క్యాన్సర్ రోగులకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి కృషి చేస్తోందని తెలిపారు. ఆధునిక వైద్య సాంకేతికత, నిపుణుల పర్యవేక్షణతో రోగులకు మెరుగైన చికిత్సా అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

చైతన్యపురిలో పీఎంజే జ్యువెలర్స్ కొత్త స్టోర్ ప్రారంభం

హైదరాబాద్‌లో మరింత విస్తరించిన పీఎంజే జ్యువెలర్స్ రిటైల్ నెట్‌వర్క్

-నాలుగు రాష్ట్రాల్లో 47కు చేరిన స్టోర్ల సంఖ్య.. ఆరు దశాబ్దాల వారసత్వంతో వినియోగదారులకు సేవలు

హైదరాబాద్, అక్టోబర్ 14, వార్తసంధ్య

దక్షిణ భారతదేశంలో ఆభరణాల రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన పీఎంజే జ్యువెలర్స్ హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురిలో నూతన స్టోర్‌ను ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవంతో హైదరాబాద్‌లో సంస్థ తన రిటైల్ కార్యకలాపాలను మరింత విస్తరించగా, దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో పీఎంజే జ్యువెలర్స్ స్టోర్ల సంఖ్య 47కు చేరింది. సంస్థ తెలంగాణ క్లస్టర్ హెడ్ దీపక్, చైతన్యపురి స్టోర్ మేనేజర్ మధన్ కుమార్, వినియోగదారుల సమక్షంలో ఈ ప్రారంభోత్సవం జరిగింది.

సంప్రదాయ కళ.. ఆధునిక డిజైన్ల సమ్మేళనం

కొత్తగా ఏర్పాటు చేసిన స్టోర్‌లో సంప్రదాయ హస్తకళా నైపుణ్యాన్ని ఆధునిక డిజైన్లతో మేళవించిన విస్తృత శ్రేణి ఆభరణాలు అందుబాటులో ఉన్నాయి. ఆలయ ఆభరణాలు, పురాతన శైలిలో రూపొందించిన బంగారు హారాలు, వడ్డాణాలు, పెళ్లి ఆభరణాల సెట్లు, అర్ధచీర వేడుకలకు తగిన ఆభరణాలు, ప్రత్యేక సందర్భాల్లో ధరించే నగలు, వజ్రాభరణాలు, రంగురాళ్లతో రూపొందించిన ఆభరణాలు ఇందులో ఉన్నాయి అదేవిధంగా కుందన్, పోల్కీ, జడావు శైలుల్లో రూపొందించిన ప్రత్యేక ఆభరణాలతో పాటు రోజువారీ వినియోగానికి అనువైన తేలికపాటి హారాలు, చెవి దిద్దులు, ఉంగరాలు కూడా అందుబాటులో ఉన్నాయని సంస్థ తెలిపింది. వివాహాలు, కుటుంబ వేడుకలు, పండుగలు, ఇతర ప్రత్యేక సందర్భాలకు అనుగుణంగా వినియోగదారులు తమ అభిరుచికి తగ్గ ఆభరణాలను ఎంపిక చేసుకునేలా స్టోర్‌ను తీర్చిదిద్దినట్లు పేర్కొంది.

ఆరు దశాబ్దాల నమ్మకమే తమ బలమన్న సీఈఓ

పీఎంజే జ్యువెలర్స్ సీఈఓ కిరణ్ షిండే మాట్లాడుతూ, చైతన్యపురిలో కొత్త స్టోర్ ప్రారంభంతో నాలుగు రాష్ట్రాల్లో తమ స్టోర్ల సంఖ్య

47కు చేరిందని తెలిపారు. గత 60 ఏళ్లుగా వినియోగదారులు తమ బ్రాండ్‌పై విశ్వాసం ఉంచుతున్నారని, ఆ నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తూ దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాల కుటుంబాలకు నాణ్యమైన ఆభరణాలు, వ్యక్తిగత సేవలను మరింత చేరువ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సంప్రదాయ కళానైపుణ్యం, ఆధునిక రూపకల్పన, నాణ్యత, పారదర్శకత తమ సంస్థ ప్రధాన లక్షణాలని తెలిపారు. తరతరాలుగా వినియోగదారులు తమ బ్రాండ్‌పై చూపుతున్న ఆదరణను కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని వెల్లడించారు.

వినియోగదారులకు మెరుగైన షాపింగ్ అనుభవం

పీఎంజే జ్యువెలర్స్ తెలంగాణ క్లస్టర్ హెడ్ దీపక్ మాట్లాడుతూ, చైతన్యపురిలో నూతన స్టోర్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి సందర్భానికి ప్రత్యేకతను చేకూర్చే ఆభరణాలను రూపొందించడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. అద్భుతమైన హస్తకళా నైపుణ్యం, సమకాలీన డిజైన్లు, వినియోగదారుల నమ్మకాన్ని ప్రతిబింబించేలా కొత్త స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వినియోగదారులకు మెరుగైన కొనుగోలు అనుభవాన్ని అందించేందుకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

ప్రతి ఆభరణం వెనుక ప్రత్యేక కథ

చైతన్యపురి స్టోర్ మేనేజర్ మధన్ కుమార్ మాట్లాడుతూ, తమ తాజా ఆభరణాల కలెక్షన్లను పరిశీలించేందుకు వినియోగదారులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆభరణం ప్రత్యేకమైన రూపకల్పన, కళానైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. వివాహాలు, కుటుంబ వేడుకలు, వ్యక్తిగత జీవితంలోని ముఖ్యమైన సందర్భాల్లో వినియోగదారుల ఆనందంలో భాగస్వాములు కావడం తమకు సంతోషంగా ఉంటుందని అన్నారు.

వజ్రాభరణాల కొనుగోళ్లలో పారదర్శకతకు ప్రాధాన్యం

పీఎంజే జ్యువెలర్స్ ఆరు దశాబ్దాలకు పైగా ఆభరణాల రంగంలో సేవలు అందిస్తూ, నాణ్యత, వ్యక్తిగత సేవలు, ప్రత్యేకమైన డిజైన్లకు ప్రాధాన్యత ఇస్తోందని సంస్థ తెలిపింది. వజ్రాభరణాల విస్తృత శ్రేణితో పాటు వివాహాలకు అనువైన ప్రత్యేక కలెక్షన్లను అందిస్తున్నట్లు పేర్కొంది.

వజ్రాభరణాల కొనుగోళ్లలో వినియోగదారులకు మరింత స్పష్టత కల్పించేందుకు తమ స్టోర్లలో వజ్రాల పరీక్షా యంత్రాలను ఏర్పాటు చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించింది. దీనివల్ల వజ్రాభరణాలను కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు సంబంధిత వివరాలను తెలుసుకొని అవగాహనతో నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని తెలిపింది.

దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు మరింత చేరువ

అనుభవజ్ఞులైన ఆభరణాల రూపకర్తలు, చేతివృత్తి నిపుణుల నైపుణ్యంతో సంప్రదాయ శైలులను ఆధునిక అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నట్లు సంస్థ వివరించింది. నాణ్యత, విలువ, కళానైపుణ్యానికి ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారులతో దీర్ఘకాలిక అనుబంధాన్ని కొనసాగించడమే లక్ష్యమని పేర్కొంది. చైతన్యపురిలో కొత్త స్టోర్ ప్రారంభం పీఎంజే జ్యువెలర్స్ విస్తరణలో మరో ముందడుగుగా నిలిచింది. ఈ స్టోర్ ద్వారా దిల్‌సుఖ్‌నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల వినియోగదారులకు సంస్థ ఆభరణాల కలెక్షన్లు, వ్యక్తిగత షాపింగ్ సేవలు మరింత చేరువయ్యాయి.

ఓటరు జాబితా లోపాలపై ఉద్యమాలను ఉధృతం చేయాలి

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 14.

బుధవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన యు ఎల్ డి వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయ పోరాటాలకు వామపక్ష పార్టీలు సిద్ధంగా ఉండాలని కోరారు ఓడర్ జాబితాలో లింకేజీ తో తీవ్ర చిక్కులు ఉన్నాయని సాంకేతిక సమస్యలు ఉన్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు పేద ప్రజలపై వాస్తవాలను ప్రశ్నిస్తుంటే మైళ్లను చూడకుండా దాడులు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు నిరంతరం ప్రక్రియ ఓటర్ నమోదు ఉండాలని ఆయన కోరారు ఓటర్ జాబితా ప్రక్షాళనకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ భావించి జాతీయస్థాయిలో ఓటర్ జాబితా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాలని ఆయన కోరారు గుజరాత్ నేతలు పేదలపై భారాన్ని మోపుతున్నారని మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి పార్టీకి సరైన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు యు ఎల్ డి కోఆర్డినేటర్ కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట దాస్ మాట్లాడుతూ సర్ లోపాల గురించి ప్రశ్నిస్తుంటే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేసుకున్న పేర్లు గల్లంతవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు ఓటర్ నమోదు కార్యక్రమం సరిగా జరగడం లేదని ఆయన విమర్శించారు చీఫ్ ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలన్న పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు యు.ఎల్.డి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి వామపక్షాలు అంతా కృషి

చేయాలని కోరారు పిడిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జార్జి రెడ్డి మాట్లాడుతూ సార్ లోపాలను సరిదిద్దాలని ఆయన కోరారు వామ పక్షులు అంత కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని ఆయన కోరారు ఓట్ నీట్ గారంటీ రాష్ట్ర అధ్యక్షులు సోగార బేగం మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ప్రశ్నిస్తే మహిళలపై దాడులు చేయడం ఏమిటని దేశం మొత్తం పోలీసు రాజ్యం నడుస్తుందని ఇది ప్రజాస్వామ్యం అనే విషయాన్ని మర్చిపోతున్నారని విమర్శించారు ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ఉద్యమాలు చేయవలసిన అవసరం ఉందని ఆమె చెప్పారు కోలా జనార్దన్ మాట్లాడుతూ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని కోరారు సర్ లోపాలపై ఉద్యమాలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు డాటా అధ్యక్షులు ప్రొఫెసర్ మోహినుద్దీన్ మాట్లాడుతూ వామపక్షాలు ఐక్యతగా ఉండి ఉద్యమాలు చేయవలసిన అవసరం ఉందని అన్నారు సర్ పై ఉద్యమాలు చేస్తే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని విద్యార్థులపై దాడులు చేయడానికి ఆయన ఖండించారు సిపిఐ ఎంఎల్ విజయ్ మాట్లాడుతూ వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కామేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బులు పంచకుండా ప్రజలను చైతన్య పంతులను చేయాలని కోరారు జస్టిస్ చంద్రకుమార్ నేతృత్వంలో వామ పక్ష పార్టీలన్నీ ఐక్యంగా ఉండి పోరాటాలు చేయవలసిన అవసరం ఉందని చెప్పారు

వంటగ్యాస్, చమురు కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 14. :
పశ్చిమాసియాలో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా దేశంలో క్రూడాయిల్, వంటగ్యాస్ ఉత్పత్తులకు కొరత తలెత్తకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం పార్లమెంట్ ప్రాంగణంలోని అనెక్స్ హాలులో బుధవారం సమావేశమైంది.సంఘం ఛైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీ రవిచంద్ర హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఆందోళకర,ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా పెట్రోలియం,డీజిల్, వంటగ్యాస్ సరఫరాలకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి సలహాలిచ్చారు.విజయదశమి,దీపావళి పండుగలు సమీపిస్తున్నందున వంటగ్యాస్ కొరత చోటుచేసుకోకుండా వినియోగదారులకు సత్వరమే సేవలందించాల్సిందిగా ఎంపీ రవిచంద్ర కోరారు. వృధాలు, వ్యర్థాలను పూర్తిగా అరికట్టాల్సిందిగా,అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిందిగా అధికారులకు ఎంపీ రవిచంద్ర పలు సూచనలు చేశారు,సలహాలిచ్చారు.సంఘం ఛైర్మన్ గా తిరిగి నియమితులైన సునీల్ దత్తాత్రే తర్కరే కు ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతో పాటు పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు,చమురు సంస్థల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లెకో ప్రతినిధి కార్యక్రమానికి శ్రీకారం

తొలి కమిటీ ఏర్పాటు చేసిన కోడిప్యాక సాయిరాంకు ప్రశంసా పత్రం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 14
సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 'పల్లెకో ప్రతినిధి' కార్యక్రమంలో భాగంగా తొలి కమిటీని ఏర్పాటు చేసిన సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కోడిప్యాక సాయిరాంను సంస్థ జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ అభినందించారు. సంస్థ లక్ష్యాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఆయన చేసిన కృషిని ప్రశంసిస్తూ సంస్థ తరఫున ప్రశంసా పత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయిలో కమిటీల ఏర్పాటుకు ఈ తొలి అడుగు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, చట్టం ద్వారా ప్రజలకు అందాల్సిన హక్కులు, సేవలపై అవగాహన కల్పించేందుకు 'పల్లెకో ప్రతినిధి' కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. కోడిప్యాక సాయిరాం స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా కమిటీల ఏర్పాటును విస్తరించి, సంస్థ లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డా. చంటి ముదిరాజ్ పిలుపునిచ్చారు.

కామారెడ్డిలో భూ వివాదం.. 40 ఏళ్లుగా న్యాయం కోసం పోరాటం!

-కోర్టు తీర్పు వచ్చినా సమస్య పరిష్కారం కాలేదంటూ ఎస్పీకి బాధితుల ఫిర్యాదు.

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వార్తా సంధ్య) అక్టోబర్ 14
తాము కొనుగోలు చేసిన స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ ఓ బాధిత కుటుంబం జిల్లా ఎస్పీని ఆశ్రయించింది. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేసింది. కామారెడ్డి పట్టణానికి చెందిన ఆశాబాను అనే మహిళ సుమారు 40 ఏళ్ల క్రితం విద్యానగర్‌లో 200 గజాల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే 2008లో రవికిరణ్, ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తులు ఆ స్థలాన్ని ఆక్రమించి బోర్డు ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కోర్టును ఆశ్రయించగా, 2018లో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని బాధితులు ఆశాబాను, అర్షఫ్ తెలిపారు. కోర్టు తీర్పు ఆధారంగా మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించి ఇంటి నిర్మాణానికి అనుమతి కూడా తీసుకున్నామని పేర్కొన్నారు. అయినప్పటికీ మూడు రోజుల క్రితం మళ్లీ అదే వ్యక్తులు తమ స్థలంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసిందని, అక్కడికి వెళ్లి చూడగా తమ స్థలం అంటూ మరో బోర్డు ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. కోర్టు తీర్పు వచ్చినప్పటికీ తమ సమస్య పరిష్కారం కావడం లేదని, తమ వాదనను పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు స్పందించి తమకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సంపాదకీయం

కరువుపై కాంగ్రెస్ సర్కార్ చోద్యం

ఎల్ నినో అంటే కేవలం వాతావరణ పరిణామం కాదు, అది వ్యవసాయం, నీటి భద్రత, ఆహార భద్రత, ప్రజల జీవనంపై ప్రభావం చూపే సవాల్. కానీ ప్రభుత్వం ఎల్ నినో హెచ్చరికకలను లెక్క చేయకుండా సంక్షోభం వచ్చే వరకు కాలయాపన చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయంలో విలువైన సమయం వృథా చేసింది. సాగు, తాగునీటి భద్రతపై చర్యలు చేపట్టలేదు. వాతావరణశాఖ అంచనాల ప్రకారం ఎల్ నినో గతంలో నమోదైన అత్యధిక స్థాయిని మించే అవకాశం ఉన్నది. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది. లేకపోతే సాగు ఆగమై, ప్రజల జీవనం దుర్భరంగా మారుతుంది. కరువు ఒక రంగానికి సంబంధించిన సమస్య కాదు. సాగునీరు, వ్యవసాయం, విద్యుత్తు, తాగునీరు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అన్నింటినీ ప్రభావితం చేసే గొలుసు ప్రభావం. ఈ ప్రమాదం రానున్నదని రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తెలుసు. కరువును ఎదుర్కొనేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అసలు ప్రశ్న ప్రభుత్వం హెచ్చరికను గుర్తించిందా లేదా అనేదే ముఖ్యం కాదు, ఆ హెచ్చరికకు తగిన వేగంతో చర్యలు తీసుకుంటున్నదా అనే ముఖ్యం. తెలంగాణకు ఆధారమైన అతిపెద్ద సహజ వనరు గోదావరి. ముఖ్యంగా ప్రాణహితగోదావరి సంగమం తర్వాత కన్నేపల్లి ప్రాంతంలో అందుబాటులోకి వచ్చే నీటిని సురక్షితంగా వినియోగించుకునే అవకాశాలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలి. కానీ ఈ విషయంలో ప్రభుత్వం విలువైన సమయాన్ని కోల్పోయింది. గోదావరిలో లభిస్తున్న నీటిని సాధ్యమైన మేరకు వినియోగించుకోవాలని, కన్నేపల్లి పంప్ హౌస్‌తోపాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వ్యవస్థలో సురక్షితంగా ఉపయోగించగల భాగాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని వానకాలం ప్రారంభంలోనే రిటైర్డ్ ఇంజినీర్లు, నీటిపారుదల నిపుణులు సూచించారు. కానీ ప్రభుత్వం పెడచెవినపెట్టింది. మరోవైపు కండ్లముందుగా ప్రవహిస్తున్న గోదావరి నీటిని సురక్షితంగా వినియోగించుకునే అవకాశాలను కోల్పోవడం పరిపాలనా దూరదృష్టి లోపంగానే కనిపిస్తున్నది. ఎల్ నినో ప్రభావం తీవ్రమైతే ప్రభుత్వం పంటలు, జిల్లాల వారీగా నీటి భద్రతా ప్రణాళిక రూపొందించాలి. ఇప్పటికే సాగులో ఉన్న పంటలను ముందుగా రక్షించాలి. ఏ ప్రాజెక్టులో ఎంత నీరున్నది? ఆ ప్రాజెక్టుల కింద ఎంత ఆయకట్టు ఉన్నది? ఎంత నీరు అవసరం ఉన్నది? అనే వివరాలను ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలి. అంతేకాకుండా చెరువుల పునరుద్ధరణ, భూగర్భజలాల సంరక్షణ వంటి చర్యలను చేపట్టాలి. రైతులకు కేవలం సలహాలు ఇవ్వడం సరిపోదు. నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళికను రూపొందించి, ఆ ప్రణాళికను అమలు చేయడానికి ప్రభుత్వం ఆర్థిక, సాంకేతిక సాయం అందించాలి. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గితే గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల మీదా ఒత్తిడి పెరుగుతుంది. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరానికి వేసవిలో తాగునీటి అవసరం మరింత పెరుగుతుంది. అందువల్ల ప్రభుత్వం తాగునీటి భద్రతా ప్రణాళిక రూపొందించాలి. ప్రతి ప్రధాన రిజర్వాయర్లో ప్రస్తుతం ఎంత నీరు ఉన్నది? సాధారణ వినియోగంతో అది ఎన్ని నెలలకు సరిపోతుంది? ప్రత్యామ్నాయ వనరులు ఏమిటి? అత్యవసర పరిస్థితిలో ఏ వనరుల నుంచి నీటిని తీసుకురావచ్చు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. హైదరాబాద్‌తోపాటు అన్ని మున్సిపాలిటీలకు ప్రధాన నీటి వనరు, ప్రత్యామ్నాయ వనరు, అత్యవసర వనరు అనే మూడు స్థాయిల నీటి భద్రతా వ్యవస్థ ఉండాలి. వర్షాభావ పరిస్థితుల్లో విద్యుత్తు రంగం మీదా ప్రభావం పడుతుంది. నీటి కొరత వల్ల జల విద్యుత్తు ఉత్పత్తి తగ్గుతుంది. అదే సమయంలో వేసవి వేడి పెరిగితే గృహాలు, వ్యవసాయం, పరిశ్రమల నుంచి విద్యుత్తు డిమాండ్ పెరుగుతుంది. కాబట్టి విద్యుత్తు కొనుగోలు, థర్మల్ విద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన ఇంధన నిల్వలు, వ్యవసాయానికి నిరంతర సరఫరా వంటి అంశాలపై ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే లేదా ఏర్పాటు చేసిన వార్ రూమ్ కేవలం అధికారుల సమావేశాలకు పరిమితం కాకూడదు. ప్రతి వారం ప్రజలకు ఒక స్పష్టమైన పరిస్థితి నివేదిక ఇవ్వాలి: జిల్లాల వారీగా వర్షపాతం, ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు, గోదావరి, కృష్ణా నదుల ప్రవాహాలు, తాగునీటి లభ్యత, సాగునీటి విడుదల, పంటల సాగు విస్తీర్ణం, భూగర్భజల పరిస్థితి, విద్యుత్తు డిమాండ్, సరఫరా వంటి అంశాలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి. రానున్న వారాల్లో వాతావరణ అంచనాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఎల్ నినో అనేది ప్రకృతి పరిణామం. దాని ప్రభావాన్ని ఎంతవరకు తగ్గించగలమో అని అలోచించాల్సింది మాత్రం ప్రభుత్వమే. ప్రజలపై కరువు ప్రభావం ఏ మేరకు పడుతుంది అనేది పాలక పెద్దలు తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంటుం ది. అందుకే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు ఒక్కరోజు కూడా ఆలస్యం చేయకూడదు. పనులకు కచ్చితమైన గడువు నిర్ణయించి, పురోగతిని ప్రజలకు తెలియజేయాలి. నీటి భద్రతను వాయిదా వేయడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధం. కొన్ని నెలల్లో రాజకీయ వివాదాలు, పరస్పర ఆరోపణలు, అనవసరమైన అంశాలపై సమయం కేటాయించిన పాలకులు, నీటి సమస్య పరిష్కారం మీదా దృష్టి పెట్టాలి. ఇప్పటికే తగిన చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. కానీ కాంగ్రెస్ పాలక పెద్దలు ఆ దిశగా ఎందుకు పట్టించుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వాలి. అది మాటలతో కాదు, చేతల్లోనే చూపించాలి. అదే ప్రభుత్వం ముందున్న తక్షణ బాధ్యత. ఇన్నాళ్లూ కరువుపై చోద్యం చూసిన పాలకులు ఇకనైనా స్పం దించాలి. కరువును ఏ విధంగా ఎదుర్కొంటారో కచ్చితమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలి.

రష్యా డీజిల్‌పై ట్రంప్ ద్వంద్వనీతి

అంతర్జాతీయ రాజకీయాల్లో శాశ్వత మిత్రులు ఉండరు, శాశ్వత శత్రువులు ఉండరు.. శాశ్వతంగా ఉండేది జాతీయ ప్రయోజనాలే అనే మాట మరోసారి నిజమవుతోంది. ప్రపంచానికి ప్రజాస్వామ్యం, న్యాయం, అంతర్జాతీయ నియమాల గురించి ఉపన్యాసాలు ఇచ్చే అగ్రరాజ్యం అమెరికా, తన ఆర్థిక ప్రయోజనాల విషయానికి వచ్చేసరికి అదే నియమాలను ఎలా పక్కన పెడుతుందో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా తీసుకున్న రష్యా డీజిల్ కొనుగోలు నిర్ణయం స్పష్టం చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై సుంకాల భారం మోపుతూ, ఆ దేశానికి ఆర్థికంగా సహకరిస్తున్నారంటూ విమర్శలు చేసిన ట్రంప్.. ఇప్పుడు తన దేశ అవసరాల కోసం అదే రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకోవడానికి సిద్ధపడటం అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది అమెరికా తన ప్రయోజనాల కోసం తీసుకున్న ఈ నిర్ణయం భారత్ విషయంలో అనుసరించిన ద్వంద్వ వైఖరిని ప్రపంచం ముందు నిలబెట్టింది. రష్యా ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో రష్యా ఆదాయాన్ని తగ్గించడం ద్వారా ఆ దేశ యుద్ధ సామర్థ్యాన్ని దెబ్బతీయాలన్నది అమెరికా సహా పాశ్చాత్య దేశాల ఆంక్షల ప్రధాన ఉద్దేశం. ఈక్రమంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై కూడా అమెరికా ఒత్తిడి పెంచింది. ముఖ్యంగా భారత్ రష్యా నుంచి తక్కువ ధరకు ముడిచమురు కొనుగోలు చేయడాన్ని ట్రంప్ ప్రభుత్వం తప్పుబట్టింది. భారత్‌పై అదనపు సుంకాలు విధించడంతోపాటు, రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేసే దేశాలపై మరింత కఠినమైన చర్యలు తీసుకుంటామనే హెచ్చరికలు చేసింది. భారత్ తన ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయాన్ని కూడా అమెరికా రాజకీయ ఒత్తిడికి ఒక సాధనంగా ఉపయోగించుకుంది. అయితే, ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. అమెరికాలో ఇంధన ధరలు పెరగడం, దేశీయంగా ప్రజలపై పడుతున్న ఆర్థిక భారం, రాబోయే మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి వంటి అంశాల మధ్య ట్రంప్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో డీజిల్ సరఫరా ఒప్పందాన్ని ప్రకటించారు. అక్టోబర్ 9న వెలువడిన ప్రకటన ప్రకారం, రష్యా నుంచి డీజిల్ సరఫరాలను ప్రారంభించి, తదుపరి దశల్లో వాటిని పెంచే ప్రణాళికను ట్రంప్ వెల్లడించారు. ఈ నిర్ణయానికి అనుగుణంగా అమెరికా ఆర్థిక శాఖ కూడా రష్యా డీజిల్‌కు సంబంధించిన కొన్ని లావాదేవీలకు పరిమిత కాలానికి అనుమతినిచ్చింది. అయితే ప్రకటించిన సరఫరాలన్నీ పూర్తిగా అమలవుతాయా, అవి అమెరికా మార్కెట్‌లో ధరలను ఎంతవరకు తగ్గిస్తాయా అన్నది ఇంకా తేలాల్సి ఉంది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. అమెరికాకు ఇంధనం అవసరమైనప్పుడు రష్యా నుంచి డీజిల్ కొనుగోలు చేయడం జాతీయ ప్రయోజనమైతే, భారత్ తన ఇంధన అవసరాల కోసం రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం తప్పెలా అవుతుంది? అమెరికా ప్రజలపై ధరల భారం పడకూడదని ట్రంప్ భావించడం సమంజసమే. కానీ అదే ఆర్థిక తర్కాన్ని భారత్ అనుసరించినప్పుడు దానిని తప్పుబట్టడం ఏ విధంగా న్యాయబద్ధమవుతుంది? అమెరికాకు ఒక న్యాయం, భారత్‌కు మరో న్యాయం ఉండాలా? ఈ ప్రశ్నకు ట్రంప్ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది

భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన వినియోగదారులలో ఒకటి. దేశీయ అవసరాలకు సరిపడా ముడిచమురును ఉత్పత్తి చేసుకోలేకపోవడంతో, దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. దాని ప్రభావం సామాన్య ప్రజల కుటుంబ బడ్జెట్‌పై పడుతుంది. వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా, విద్యుత్ ఉత్పత్తి వంటి అనేక రంగాలపై ఇంధన ధరల ప్రభావం ఉంటుంది. అందువల్ల తక్కువ ధరకు లభించే ముడిచమురును కొనుగోలు చేయడం భారత్‌కు కేవలం వాణిజ్య నిర్ణయం మాత్రమే కాదు; దేశ ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన అంశం కూడా. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో చోటుచేసుకున్న మార్పులను భారత్ తనకు అనుకూలంగా ఉపయోగించుకుంది. రష్యా నుంచి రాయితీ ధరలకు ముడిచమురును కొనుగోలు చేయడం ద్వారా దిగుమతి ఖర్చులను నియంత్రించేందుకు ప్రయత్నించింది. ఇది భారత ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయం. ఒక దేశం తన ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు ఇంధనాన్ని సమకూర్చుకోవాలనుకోవడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైన ఆలోచన కాదు. అంతేకాకుండా, భారత్ తన విదేశాంగ విధానంలో వ్యూహాత్మక స్వతంత్రతకు ప్రాధాన్యం ఇస్తోంది. అమెరికాతో సంబంధాలను కొనసాగిస్తూనే రష్యాతోనూ సంబంధాలను కాపాడుకోవాలనే వైఖరి దశాబ్దాలుగా భారత దౌత్య విధానంలో భాగంగా ఉంది అయినప్పటికీ, భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో అమెరికా అదనపు సుంకాలు విధించడం, మరిన్ని ఆంక్షలు విధిస్తామని హెచ్చరించడం అంతర్జాతీయ వాణిజ్యంలో సమానత్వ సూత్రంపై సందేహాలు కలిగించింది. ఇప్పుడు అమెరికా కూడా రష్యా నుంచి డీజిల్ కొనుగోలుకు సిద్ధపడటంతో ఆ సందేహాలు మరింత బలపడ్డాయి. అమెరికా తన అవసరాల కోసం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించుకుంటూ, భారత్‌కు మాత్రం అలాంటి నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ లేదన్నట్లుగా వ్యవహరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. అయితే, ఈ వ్యవహారాన్ని కేవలం వ్యక్తిగత రాజకీయ విమర్శలకు పరిమితం చేయకూడదు. దేశాల ఇంధన అవసరాలు, దిగుమతి చేసుకునే ఇంధన రకం, ఆంక్షల పరిధి, ఒప్పందాల నిబంధనలు వేర్వేరుగా ఉండవచ్చు. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేయడం, రష్యాలో ఉత్పత్తి చేసిన డీజిల్‌ను దిగుమతి చేసుకోవడం రెండూ ఒకే రకమైన వాణిజ్య లావాదేవీలు కావు. ట్రంప్ నిర్ణయం వెనుక దేశీయ రాజకీయాల ప్రభావాన్ని కూడా విస్మరించలేం. అమెరికాలో ఇంధన ధరలు పెరగడం పాలక ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందికరంగా మారవచ్చు. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ధరల నియంత్రణ ఓటర్ల అభిప్రాయాలను ప్రభావితం చేసే అంశం. ప్రజలకు తక్కువ ధరలకు ఇంధనం అందించగలిగితే రాజకీయంగా ప్రయోజనం కలుగుతుందని పాలకులు భావించడం సహజం. అందుకే రష్యాతో సంబంధాల విషయంలో గతంలో అనుసరించిన కఠిన వైఖరిని సడలించేందుకు ట్రంప్ సిద్ధపడినట్లు కనిపిస్తోంది. అయితే, ఇంధన ధరల తగ్గింపు ఎంతవరకు సాధ్యమవుతుందన్నది సరఫరాల పరిమాణం, అంతర్జాతీయ డిమాండ్, రవాణా వ్యయాలు, శుద్ధి సామర్థ్యం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. కేవలం ఒప్పంద ప్రకటనతోనే ధరలు గణనీయంగా తగ్గుతాయని చెప్పలేం. ఈ ఒప్పందం ఉక్రెయిన్‌కు కూడా ఆందోళన కలిగిస్తోంది. రష్యా యుద్ధం కొనసాగుతున్న సమయంలో ఆ దేశానికి ఇంధన ఎగుమతుల ద్వారా ఆదాయం లభిస్తే, అది పరోక్షంగా రష్యా ఆర్థిక వ్యవస్థకు తోడ్పడవచ్చన్నది ఉక్రెయిన్ వాదన. అమెరికా ఇంతకాలం రష్యా ఆదాయాన్ని తగ్గించేందుకు ప్రయత్నించిన నేపథ్యంలో, ఇప్పుడు అదే దేశం నుంచి డీజిల్ కొనుగోలు చేయాలనే నిర్ణయం ఆంక్షల ప్రభావాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లు యుద్ధానికి ఎంతవరకు ఆర్థికంగా దోహదపడతాయన్నది వేరే విశ్లేషణకు సంబంధించిన అంశమైనప్పటికీ, అమెరికా విధానంలో కనిపిస్తున్న మార్పు మిత్రదేశాల్లో అనుమానాలకు తావిస్తోంది. భారత్ తన ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవడానికి దిగుమతుల మూలాలను విస్తరించాలి. ఒకే దేశంపై అధికంగా ఆధారపడకుండా, రష్యా, పశ్చిమాసియా, అమెరికా తదితర ప్రాంతాల నుంచి సరఫరాలను సమతుల్యం చేసుకోవాలి. దేశీయ చమురు అన్వేషణ, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, విద్యుత్ ఆధారిత రవాణా, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడులను పెంచాలి. అంతర్జాతీయ రాజకీయాల్లో ఏ దేశం ఎప్పుడు తన వైఖరిని మార్చుకుంటుందో చెప్పలేని పరిస్థితుల్లో, స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయడం అత్యంత అవసరం. చివరగా, ట్రంప్ రష్యా డీజిల్ ఒప్పందం భారత్‌కు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతోంది. అంతర్జాతీయ రాజకీయాల్లో నీతి, న్యాయం, ప్రజాస్వామ్యం వంటి విలువల గురించి ఎంతగా మాట్లాడినా, సంక్షోభ సమయంలో దేశాలు ముందుగా తమ ప్రయోజనాలనే పరిగణనలోకి తీసుకుంటాయి. అమెరికా తన ప్రజల కోసం రష్యా డీజిల్‌ను కొనుగోలు చేయడం తప్పు అని మాత్రమే చెప్పడం ఈ సమస్యకు పరిష్కారం కాదు. కానీ అదే నిర్ణయం తీసుకున్న భారత్‌ను గతంలో శిక్షించడానికి ప్రయత్నించడం మాత్రం ప్రశ్నించదగిన ద్వంద్వ వైఖరి. అమెరికాకు తన ప్రజల ప్రయోజనాలను కాపాడుకునే హక్కు ఉన్నట్లే, భారత్‌కు కూడా తన ప్రజల ప్రయోజనాలను పరిరక్షించుకునే హక్కు ఉంది. ఇంధన కొనుగోళ్ల విషయంలో దేశాల మధ్య సమానమైన ప్రమాణాలు ఉండాలి. ఆంక్షలు న్యాయబద్ధమైన లక్ష్యాలతో, స్థిరమైన విధానంతో అమలు కావాలి. శక్తిమంతమైన దేశాలు తమకు అనుకూలంగా నియమాలను మార్చుకుంటూ, ఇతర దేశాలకు మాత్రం నీతిపాఠాలు చెప్పడం అంతర్జాతీయ సహకారానికి మేలు చేయదు. ప్రపంచానికి కావలసింది బలవంతుడి నిర్ణయమే న్యాయం అనే వ్యవస్థ కాదు; అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని, ఆర్థిక అవసరాలను, సమాన హక్కులను గౌరవించే అంతర్జాతీయ వ్యవస్థ. ట్రంప్ రష్యా డీజిల్ నిర్ణయం ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తుచేస్తోంది.

రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు 2027 ముప్పు



ప్రస్తుతి ప్రకటించినప్పుడు ఏ ప్రభుత్వానికైనా, ఎంతటి బలమైన వ్యవస్థ ఉన్నా ఒక్కసారిగా కంపిస్తుంది. ఐదురోజుల ఎల్ నినో నుండి శాశ్వతపు విపత్తులు పాలకులకు నిద్రలేకుండా చేసే అత్యంత ఉష్ణమైన సవాళ్లు, భూగోళం వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ జనాభా వాతావరణ కుదుపులు నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయ రంగాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. నీరు అనేది లేకపోతే మానవ సమాజమే మూగబోతుంది. భూగోళం వేడెక్కి ఇంధనం ఎక్కువైపోతుంది, సాగునీరు ఇంకిపోతే ఆధారాలు కన్పించకుండాపోతాయి. అటు తాగు, సాగు నీటి కొరత ఏర్పడితే జల విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా పడిపోయి కరెంట్ కోతలు మొదలవుతాయి. తద్వారా పారిశ్రామిక ఉత్పాదకత తగ్గిపోయి, నిత్యావసరాల ధరలు చుక్కలను తాకుతాయి, భూ ఉష్ణోగ్రత పతాకస్థాయికి చేరడాన్ని ముఖ్యంగా ఆసియా రాష్ట్రాలను ఉమ్మడవుతున్న ముప్పు దేవడని సాధారణ ఎల్ నినో కాదు. అంతకంటే ఎన్నో రెట్లు తీవ్రమైన సూపర్ ఎల్ నినో కుదుపులను తట్టుకోవడమంటే ఈనాటి పరిస్థితిలో అంతంతమాత్రంగానే సమాధానం. జలాశయాలు సగం కూడా నిండని పరిస్థితిలో, ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటిని వచ్చే ఏడాది జూన్ వరకు తీవ్రమైన పోరాటంలో, అత్యంత అప్రమత్తంగా వాడుకోవాల్సిన కఠినయాథార్థ్యాన్ని పరిస్థితి తేటతెల్లం చేస్తోంది. ఆశయాల్లో, నీటి చుక్కలు అడుగంటిపోతున్న ఈ తరుణంలో పాలకులు ఇది మూసపద్ధతిగా చేసి విధంగా ఆలోచించాల్సిన మారింది. ఈ సమగ్ర పరిస్థితిన కారణంగా రాబోయే రోజుల్లో ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తమవడం సహజం. తాగునీరు అందక, విద్యుత్ కోతలు పెరిగి, పంటలు ఎండిపోతున్న సమయాల్లో సగటు మనిషి ఉగ్గిపోవడం గుర్తించగలము. ఈ అసంతృప్తిని ప్రజా ఆగ్రహాన్ని నిరసన పోరాటాలై తిరుగుబాటుగా మలచడానికి, రాజకీయ లబ్ధి పొందడానికి ప్రతిపక్షాలు ఎప్పుడూ చాటును కూర్చుంటాయి. ప్రభుత్వంపై అపనమ్మకాన్ని, ప్రజల అసంతృప్తిని ఇది ఇతరంగా భావిస్తాయి. అయితే, రాజకీయ ప్రతిపక్షాల విమర్శలను ఎదుర్కొంటూ కేవలం పోలీస్ బలంతో, ప్రభుత్వబలంతో ఈ విపత్తును నియంత్రించడమే ఏ ప్రభుత్వానికైనా సాధ్యం కాదు అని ఈ పిడుగుముప్పు గురించిన హెచ్చరికలను ప్రభుత్వాలు చేయాల్సింది ఏమిటి? అంటే ముందస్తు ప్రణాళికలతో ఈనాటి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. ఉన్న నీటి వనరులు, విద్యుత్ లభ్యతపై ప్రతి పౌరుడికి ముందస్తు అవగాహన కల్పించాలి. నీటిని, కరెంట్ ను ఏ విధంగా పొదుపుగా వాడుకోవాలో వివరించే ఒక ప్రజా ఉద్యమంలాంటి ప్రచారాన్ని చేపట్టాలి. ఇది ఒకానొక ఎల్ నినో సమస్యకు కేవలం ప్రభుత్వ సమస్యగా కాకుండా, ఇది మనందరి ఉమ్మడి సంక్షోభం అనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రతి గృహం, ప్రతి ప్రభుత్వ ప్రజా పారిశ్రామికవేత్త నీటి పొదుపులో భాగస్వాములయ్యేలా వినూత్న విప్లవాత్మకమైన మార్గదర్శకాలను అమలు చేయాలి. ప్రజలను ఈ విపత్తు నిర్వహణలో భాగస్వాములను చేసినప్పుడు ప్రభుత్వాలపై భారం తగ్గుతుంది, కాస్త ఊరట దొరుకుతుంది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన శక్తివంతమైన ఎల్ నినో ప్రభావం, విపరీతంగా వేడెక్కుతున్న సముద్రాలు రాబోయే కాలంలో ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరికల ప్రకారం, ఈ నమోదు వాతావరణ దృగ్విషయం డిసెంబర్ లో శిఖరాగ్రానికి చేరుకుని 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉంది. గ్రీన్ హౌస్ ఉద్గారాల వల్ల పెరిగిన ఉష్ణోగ్రతలకు తోడు ఈ ఎల్ నినో ప్రభావం తోడవడంతో 2027 అత్యంత ఉష్ణోగ్రతలు నమోదయ్యే సంవత్సరంగా మారవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. మానవ కార్యకలాపాల వల్ల వాతావరణంలో పెరుగుతున్న గ్రీన్ హౌస్ ఉద్గారాలు భూమిని నిరంతరం వేడెక్కిస్తున్నాయి. దీనికి తోడు ఎల్ నినో కారణంగా సముద్రాల నుండి విడుదలయ్యే అదనపు వేడి వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తుంది. ఈ రెండు పరిణామాలు కలిపికట్టుగా పనిచేయడం వల్ల, రాబోయే 2027 సంవత్సరం రికార్డు స్థాయిలో అత్యంత ఉష్ణోగ్రతలు నమోదయ్యే సంవత్సరంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే సహజ సిద్ధమైన వాతావరణ చక్రం. అయితే దీని ప్రభావం కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా డెలికేటివ్ ప్రభావం చూపుతుంది. ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఆసియా-పసిఫిక్ ప్రాంతాల్లో తీవ్రమైన వర్షాభావం, కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. దక్షిణ అమెరికాలోని కొన్ని తీర ప్రాంతాల లోనూ, ఈక్వడార్ వంటి దేశాల భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు ఎదుర్కొనే అవకాశం ఉంటే వాతావరణంలో వచ్చే ఈ తీవ్రమైన మార్పులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఆసియా, ఆస్ట్రేలియాలో ధాన్యపాతం తగ్గడం వల్ల గోధుమ, బియ్యం వంటి ధాన్యాల దిగుబడి తగ్గిపోయి ఆహార కొరత ఏర్పడే అవకాశం ఉంది. అలాగే సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల సముద్ర జీవావరణం, ముఖ్యంగా పగడపు దిబ్బలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఉష్ణోగ్రత పరిస్థితులను అదుపు చేయడంలో పాలకుల విఫలమవుతు, ప్రజల అసంతృప్తి రెండు చక్రాలుగా పనిచేస్తాయి. కనివిని ఎరుగని ఈ నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ఇప్పుడే కార్యాచరణ రూపొందించాలి. క్షేత్రస్థాయిలో కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి. రెండు, రాబోయే వేసవిలో ప్రజ్ఞాగ్రహం ఉద్రికతగా మారి ప్రభుత్వాలు కూలిపోవడం ఖాయం. కాలం మించిపోకముందే ఇరుమార్గమై, ప్రతి చుక్క నీటిని భద్రపరచే దిశగా యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించడమే పాలకుల ముందున్న ఏకైక కర్తవ్యం.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

బదిలీ పై వెళ్తున్న అధికారికి ఆత్మీయ సన్మానం

రామగిరి,(వార్త సంధ్య)అక్టోబర్ 14.
రామగుండం-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా లో ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ ఒడిశా రాష్ట్రం లోని నైని ఏరియాకు బదిలీ పై వెళుతున్న అబ్దుల్ షబ్బీరుద్దీన్ ను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు,వివిధ విభాగాల అధిపతులు బుధవారం జిఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు,అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో, అంకిత భావంతో వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్వోటు జియంలు యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫ్యాటింగ్,ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జి.లక్ష్మి నారాయణ, విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ,డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి,అఫ్సర్ పాషా,కె.ఐలయ్య , రవికుమార్,రాజా రవిచరణ్,ఆసిఫ్ యాసిన్,జ్ఞాన సంబంధన్,శ్రీకాంత్, ఎండీ.ఆసిఫ్,విక్రమ్,కోల శ్రీనివాస్,సుజీత్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన విద్యార్థులు

-అభినందించిన రామగిరి ఎస్సై

రామగిరి,(వార్త సంధ్య)అక్టోబర్ 14.
గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన రామగిరి మండల విద్యార్థులు. హైదరాబాద్ లో 1,212 మందితో జరిగిన కరాటే ప్రదర్శనలో పాల్గొని ప్రపంచ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన రామగిరి మండల విద్యార్థులు లొంకాకేసరం మాజీ సర్పంచ్ ఎండి.మంజుర్ మనుమరాలు మహమ్మద్ ఆఫీఫా ఫాతిమా,ఎడ్ల రిషికేశ్ వీరికి నేడు రామగిరి ఎస్.ఐ టి.శ్రీనివాస్ చేతుల మీదుగా తల్లిదండ్రుల సమక్షంలో గిన్నిస్ సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ ఇచ్చిన ద్రోణచార్య స్పోర్ట్స్ అకాడమి కల్వచర్ల కరాటే మాస్టర్ మారుపాక సంపత్ కు చిన్నారుల తల్లిదండ్రులకు అభినందనలు తెలియచేసారు.

18న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలు

రామగిరి,(వార్త సంధ్య)అక్టోబర్ 14.
రామగుండం-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల ఆధ్వర్యంలో 18-10-2026 (ఆదివారం) సాయంత్రం 06:00 గంటల నుండి రాణి రుద్రమ దేవి క్రీడా ప్రాంగణం నందు "సద్దుల బతుకమ్మ,ఫ్యామిలీ డే వేడుకలు" నిర్వహించబడునని రామగుండం-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా అధికార ప్రతినిధి బి.సుదర్శనం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ వేడుకల్లో భాగంగా బతుకమ్మ ఆట-పాటలు నిర్వహించడం కోసం తగిన ఏర్పాట్లు చేయడంమే కాకుండా ఉత్తమంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను ఎంపిక చేసి ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులతో పాటు 10 ప్రోత్సాహక బహుమతులు ప్రధానం చేయబడునని అన్నారు. ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు,కాలనీ మహిళలు అధిక సంఖ్యలో బతుకమ్మలతో విచ్చేసి ఈ వేడుకలను జయప్రదం చేయవలసిందిగా కోరారు.

సమగ్ర భూసర్వే (రి సర్వే) పై అవగాహన సదస్సు

జైపూర్,(వార్త సంధ్య)అక్టోబర్ 14.
జైపూర్ మండలంలోని బెజ్జల గ్రామపంచాయతి మద్దులపల్లి రెవెన్యూ గ్రామం నందు తేది: 14.10.2026 బుధవారం రోజున సమగ్ర భూసర్వే (రి సర్వే) పై అవగాహన సదస్సు ను నిర్వహించడమైనది. ఇట్టి గ్రామసభ లో సమగ్ర భూ సర్వే యొక్క ప్రాముఖ్యతను, సర్వే చేయు విధి విధానాలను వివరించడమైనది. సమగ్ర భూ సర్వే వలన భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా కచ్చితమైన భూ రికార్డులను రూపొందించవచ్చునని, ఇట్టి సమగ్ర భూ సర్వే నందు ప్రతి రైతు భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని తెలిపినారు. ఈ గ్రామ సభ లో జైపూర్ తహసీల్దార్ వనజ రెడ్డి, ఎంపీడీఓ శ్రీపతి బాపూరావు, బెజ్జల గ్రామ సర్పంచ్ శ్రావంతి -రాజనర్సు, నర్సింగాపూర్ గ్రామ సర్పంచ్ తిరుపతి, బెజ్జల వార్డ్ మెంబర్స్, మండల సర్వేయర్, రెవెన్యూ, అధికారులు గ్రామ పంచాయతీ అధికారులు ప్రజాప్రతినిధులు, రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జ్ఞానేశ్ కుమార్‌పై మోదీకి అంత ప్రేమ ఎందుకు?

ఎన్నికల కమిషన్‌పై సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం విమర్శలు

సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 14 (వార్త సంధ్య)
కారేపల్లి: జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని విద్యార్థులు, యువజనులు, ప్రజలు దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనలు చేస్తుంటే, వారిపై తీవ్ర నిర్బంధం ప్రయోగించడం వెనుక ప్రధాని నరేంద్ర మోదీకి జ్ఞానేశ్ కుమార్‌పై అంత ప్రేమ ఎందుకని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం ప్రశ్నించారు. స్థానిక భాగం రామ నరసయ్య భవనంలో వల్లబోయిన కొండలరావు అధ్యక్షతన సీపీఎం సింగరేణి మండల కమిటీ, శాఖ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్య వీరభద్రం మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ వ్యవహారాల్లో మోదీ ప్రభుత్వం జోక్యం చేసుకుంటోందని విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా అంశంలో కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో అవకతవకలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక ప్రక్రియలో చట్ట సవరణలు, పదవీ విరమణ అనంతరం రక్షణ కల్పించే చట్టపరమైన మార్పులు వంటి అంశాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై అనేక సందేహాలను కలిగిస్తున్నాయని అన్నారు. రాజ్యాంగబద్ధంగా స్వతంత్రంగా పనిచేయాల్సిన ఎన్నికల కమిషన్‌ను బీజేపీకి అనుకూల సంస్థగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితా నుంచి కోట్లాది ఓట్లు తొలగించడం, ఓటు నమోదు దరఖాస్తుల నిబంధనల్లో మార్పులు చేయడం, సుప్రీంకోర్టు తీర్పులను పట్టించుకోకపోవడం, తోటి కమిషనర్ల సూచనలను పక్కనపెట్టి ఏకపక్షంగా వ్యవహరించడం వంటి అంశాలు ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఈ చర్యలు భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ వ్యవహారాలపై ప్రజలు నిరసనలు తెలుపుతుంటే, ఢిల్లీలో విద్యార్థులు, యువకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, జర్నలిస్టులపై నిర్బంధం విధించడం సరికాదన్నారు. ఆందోళనలను అణచివేసేందుకు ఇంటర్నెట్ సేవల నిలిపివేత, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం, ఉద్యమకారులను అవమానించే ప్రయత్నాలు వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల నిరసనలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రపంచానికి ప్రజాస్వామ్య విలువలను చాటాల్సిన భారతదేశం, ఇలాంటి చర్యలతో అంతర్జాతీయంగా ప్రతిష్ఠను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని భూక్య వీరభద్రం అన్నారు. అధిక ధరలు, నిరుద్యోగం, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలు, ప్రజా సంపద పరిరక్షణ వంటి అంశాలపై ప్రజా ఉద్యమాలే పరిష్కార మార్గమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే. నరేంద్ర, వజ్జా రామారావు, కురసం శ్రీను, బానోత్ కిషన్, గంగాధర్, ఉపేందర్, పాల్తీయ రాంజీ, వాంకుడోత్ బాబురావు, చల్ల మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

సబ్ స్టేషన్ ముందుర ధర్నా

బాన్సువాడ (వార్త సంధ్య)అక్టోబర్ 14.
కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని హనుమాజీపేట్ గ్రామ శివారులో ఎండిపోయిన పంట పొలాలను బీఆర్ఎస్ నాయకులు మోరిల్ శ్రీనివాస్ రావు దుద్దాల అంజి రెడ్డి సందర్శించి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు మోరిల్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ పంటలు ఎండిపోవడంతో నష్టపోయిన రైతుల పరిస్థితిని అడిగి తెలుసుకుని రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులకు నాణ్యమైన విద్యుత్ ను నిరంతరాయంగా అందించాలని సబ్ స్టేషన్ ను ముట్టడించి ధర్నా నిర్వహించారు. కరెంటు సమస్యతో పంటలు నష్టపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించి వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంజి రెడ్డి శివసూరి దుర్గం సంజీవులు పిట్ల హన్మండ్లు భాస్కర్ నాయక్ కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలునాయక్ ని కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి

దేవరకొండ, (వార్త సంధ్య)అక్టోబర్ 14.
ఉమ్మడి నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టి, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ వచ్చేలా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు, పార్టీ ఆదేశాల మేరకు పట్టభద్రుల ఓటరు నమోదు పెంచేందుకు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి శ్రేణులతో కలిసి దేవరకొండ నియోజకవర్గం నుంచి అధిక మెజారిటీ వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించాలని సూచించారు.

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టంపై శిక్షణ..

-వనపర్తి, గద్వాల జిల్లాల డెమో, డీఆర్‌ఏ బృందాలకు అవగాహన...

-చట్టంపై అవగాహనతోనే మెరుగైన వైద్య సేవలు...

వార్త సంధ్య :వనపర్తి జిల్లా, ప్రతినిధి,అక్టోబరు 14:
క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) తెలంగాణ చట్టం--2010 అమలుపై బుధవారం వనపర్తిలో శిక్షణ, సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. వనపర్తి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ భాస్కర్ నాయక్ (ఎంబీబీఎస్,డి.ఆర్థో) ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ ఛాంబర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించరు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సీఈఏ సెల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వెంకట రమణ, జోగులాంబ గద్వాల జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ జె.సంధ్య కిరణ్మయి హాజరయ్యారు. వనపర్తి,జోగులాంబ గద్వాల జిల్లాలకు చెందిన డెమో విభాగాలు,డీఆర్ఏ బృందాలకు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలు,సంబంధిత పోర్టల్ వినియోగంపై శిక్షణ అందించారు. పోర్టల్ నిర్వహణలో సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, శిక్షణలో చురుకుగా పాల్గొనాలని అధికారులు సూచించారు.

తెలంగాణ సచివాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 14.
సచివాలయ మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రమాదేవి నేతృత్వంలో జరిగిన ఈ బతుకమ్మ ఉత్సవాలకు హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ, దేశంలో మరెక్కడా లేని విధంగా పూలను పూజించే గొప్ప సాంప్రదాయం మన తెలంగాణలో ఉందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో అత్యంత కీలక పాత్ర వహించే సచివాలయ ఉద్యోగులు ఈ బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు అనంతరం సచివాలయ మహిళా ఉద్యోగులు అధికారులు తమ కుటుంబ సభ్యులతో బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

అఖిలేష్ యాదవ్‌కు షాక్..

- బీజేపీలో చేరిన ఎస్పీ రెబల్ ఎమ్మెల్యేలు

సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్‌కు షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ముగ్గురు తిరుగుబాటు ఎమ్మెల్యేలు బుధవారం బీజేపీలో చేరారు. 2022లో ఈ ముగ్గురూ ఎస్పీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారు. గౌరి గంజ్ నుంచి గెలిచిన రాకేష్ ప్రతాప్ సింగ్, గోసయ్‌గంజ్ నుంచి గెలిచిన అభయ్ సింగ్, కల్పి నుంచి గెలిచిన వినోద్ చతుర్వేది బీజేపీలో చేరారు. ఈ ముగ్గురు ఇప్పటికే ఎస్పీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారు. 2024లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో వీరు ఎస్పీ జారీ చేసిన విప్‌కు వ్యతిరేకంగా బీజేపీ అభ్యర్థికి ఓటు వేశారు. 2027లో ఉత్తర ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎస్పీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడం అఖిలేష్ యాదవ్‌కు భారీ ఎదురుదెబ్బగానే పరిగణించాలి. పార్టీ మారిన ముగ్గురూ ఎస్పీకి అత్యంత కీలకమైన నేతలే. మరికొందరు నేతలు కూడా ఎస్పీ నుంచి బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితమే అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ నుంచి కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎస్పీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. కానీ, పరిస్థితి చూస్తుంటే మాత్రం ఎస్పీ నుంచి ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేలానే కనిపిస్తోంది. మరోవైపు ఎస్పీ.. కాంగ్రెస్‌తో పొత్తు కోసం ప్రయత్నిస్తోంది. కానీ, సీట్ల పంచాయితీ మాత్రం తేలడం లేదు. అయితే, బీజేపీలో ఎమ్మెల్యేల చేరిక ప్రభావం ఎస్పీపై ఎంతవరకు ఉంటుందో చూడాలి. యూపీలో వరుసగా రెండుసార్లు యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలోని బీజేపీ అధికారం దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈసారి కూడా గెలిచి యూపీలో హ్యాట్రిక్ విజయం నమోదు చేయాలని బీజేపీ భావిస్తోంది.

కుంటి సాకులను ఆమోదించం..

- కేంద్ర ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం

-2023 నాటి శృంగేరి ఎన్నికల కౌంటింగ్ వీడియో గల్లంతు

న్యూఢిల్లీ, (వార్త సంధ్య)అక్టోబర్ 14.
అందుబాటులో ఉన్న రికార్డులను సమర్పించడంలో విఫలమైతే ఈసీఐకి వ్యతిరేకంగా ప్రతికూల నిర్ణయం తీసుకోవలసి ఉంటుందని న్యాయస్థానం హెచ్చరించింది. తన రికార్డులను పోగొట్టుకున్నామని ఈసీఐ ఎలా చెప్పగలదు? ఎన్నికలు నిర్వహించడమే మీ ప్రధాన విధి. అటువంటప్పుడు మీ వద్ద కచ్చితంగా ఒక పత్రం ఉండాలి కదా. మేము దానిని వెతికే ప్రయత్నం చేస్తున్నామని చెప్పడానికి ఆస్కారం ఎక్కడుంది? మీరు ఆ పత్రాన్ని ఎన్నికైన అభ్యర్థికి ఇచ్చారు.రికార్డుల భద్రత లేదా నిర్వహణ మీ వద్ద లేదా? మీ వద్ద ఉన్న దానిని తదుపరి విచారణ తేదీన సమర్పించండి. లేకపోతే మేము మీపై ప్రతికూల నిర్ణయానికి రావలసి ఉంటుంది. ఎలాంటి బలహీనమైన సాకులు మేము అంగీకరించము అని న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవాలతో కూడిన ధర్మాసనం ఈసీఐకి స్పష్టం చేసింది. 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీఎన్ జీవరాజ్‌పై 201 ఓట్ల స్వల్ప తేడాతో విజయం సాధించినప్పటికీ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ల పునఃలెక్కింపు అనంతరం తన పదవిని కోల్పోయిన కాంగ్రెస్ నేత టీడీ రాజేగౌడ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ జరుపుతున్నది. 2023లో జరిగిన అసలు లెక్కింపు, ఈ ఏడాది మేలో నిర్వహించిన రీకౌంటింగ్, రెండింటికీ సంబంధించిన ఎన్నికల పరిశీలకుడి నివేదిక వీడియో రికార్డింగులను రాజేగౌడ కోరిన తర్వాత, ఫుటేజ్‌ను గుర్తించడంలో విఫలమైనందుకు ఈసీఐని ధర్మాసనం తప్పుపట్టింది.

కేంద్ర పింఛను పథకాల్లో ఇందిర పేరు తొలగింపు

న్యూఢిల్లీ: (వార్త సంధ్య)అక్టోబర్ 14.
వాటిలో కొన్నింటికి ఉన్న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరును తొలగించింది. ఎన్ఎస్ఏపీని 2026-27 నుంచి అయిదేండ్ల పాటు రూ.53,428 కోట్ల బడ్జెట్‌తో కొనసాగించాలని నిర్ణయించింది.తాజా నిర్ణయం ప్రకారం ఎన్ఎస్ఏపీని ప్రధాన్ మంత్రి సామాజిక్ సహాయత యోజనగా, ఇందిరా గాంధీ వృద్ధ్యాప్య పింఛను పథకాన్ని ప్రధాన్ మంత్రి వృద్ధావస్థ పెన్షన్ యోజనగా, ఇందిరా గాంధీ వితంతు పెన్షన్ స్కీమ్‌ను ప్రధాన్ మంత్రి విధవ పెన్షన్ యోజనగా, జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని ప్రధాన్ మంత్రి పరివార్ లాభ్ యోజనగా మార్చారు.

నెట్‌ఫ్లిక్స్‌లో 1,000 మంది ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ: (వార్త సంధ్య)అక్టోబర్ 14.
ఆశించిన స్థాయికంటే వృద్ధి నెమ్మదించడం, వీక్షకుల సమయం కోసం మార్కెట్‌లో విపరీతంగా పోటీ పెరిగిపోవడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. 2022 తర్వాత కంపెనీ చేపట్టిన అత్యధిక ఉద్యోగాల కోత ఇదే కావడం గమనార్హం.ఈ లే ఆఫ్‌లు కంపెనీ మొత్తం వర్క్‌ఫోర్స్‌లో సుమారు ఆరు శాతం మందిపై ప్రభావం చూపనున్నాయి. 'ది వాల్ స్ట్రీట్' జర్నల్ నివేదిక ప్రకారం ఈ తొలగింపుల ప్రభావం ప్రధానంగా ప్రొడక్ట్, టెక్నాలజీ, లీగల్, హ్యూమన్ రిసోర్సెస్(హెచ్ఆర్) విభాగాలపై ఎక్కువగా పడింది.

యూపీఐ చెల్లింపులను అంగీకరించం



న్యూఢిల్లీ, (వార్త సంధ్య)అక్టోబర్ 14.
ఎండీఆర్‌ను వ్యతిరేకిస్తూ ఇకపై యూపీఐ చెల్లింపులను అంగీకరించ రాదని నిర్ణయించినట్లు వారు తెలిపారు. పెట్రోల్, డీజిల్ కొనుగోలుకు డిజిటల్ చెల్లింపులు చేసే వాహనదారులకు ఇది ఇబ్బందికరమే అయినప్పటికీ ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని పేర్కొన్నారు.చమురు కంపెనీల ఏకపక్ష నిర్ణయాలతో పెట్రోలియం డీలర్లు ఇప్పటికే తక్కువ మార్జిన్ లాభాలతో ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు ఎండీఆర్ వద్దని అసోసియేషన్ పంజాబ్ అధ్యక్షుడు పరంజిత్ సింగ్, అధికార ప్రతినిధి మాంటీ సెహగాల్ తెలిపారు.

ఢిల్లీ నిరసనలపై హార్వర్డ్ స్కాలర్ల ఢీ

న్యూఢిల్లీ (వార్త సంధ్య)అక్టోబర్ 14.
సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పనితీరు, 'సర్' అవకతవలపై ఢిల్లీలో జరుగుతున్న నిరసనలపై హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన స్కాలర్లు, విద్యార్థులు, ఆచార్యులు రెండు వర్గాలుగా విడిపోయారు! వీరిలో ఒక వర్గం నిరసనకారులను సమర్థించగా, మరొక వర్గం వారిని విమర్శించింది.ఈ నెల 10న ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన సీజేపీ మద్దతుదారులపై పోలీసుల చర్యను హార్వర్డ్ వర్సిటీకి చెందిన 100 మంది పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది మంగళవారం ఖండించారు. పోలీసులు క్రూరంగా వ్యవహరించారని ఆరోపించారు. మరోవైపు హార్వర్డ్‌కే చెందిన 44 మంది భారత స్కాలర్లు ఇటీవల ఢిల్లీలో జరిగిన నిరసనలను భారత రాజ్యాంగ వ్యవస్థలైన ఈసీ, సుప్రీం కోర్టు లాంటి వాటిపై జరిగిన దాడులుగా అభివర్ణించారు.

అరామ్‌కో హెడ్‌క్వార్టర్స్‌పై
హౌతీల దాడి

యెమెన్‌పై దాడులు ఆపకపోతే మరింతగా విరుచుకుపడతాం

సౌదీ అరేబియాకు వార్నింగ్

రియాద్ (వార్త సంధ్య)అక్టోబర్ 14.
సౌదీ అరేబియాలో హౌతీల దాడులు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. సౌదీ అరేబియాలోని తూర్పు నగరం ధహ్రాన్‌లో ఉన్న ఆ దేశ జాతీయ చమురు సంస్థ అరామ్‌కో ప్రధాన కార్యాలయంలోని ఓ పరిపాలనా భవనంపై మీద మంగళవారం హౌతీలు బాలిస్టిక్ క్షిపణులు,క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేశారు. ఈ విషయాన్ని ఆ దేశ ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. బిల్డింగ్‌లోని పై మూడు అంతస్తులు దెబ్బతిన్నాయని, ఇందులో సీఈవో కార్యాలయం కూడా ఉందని చెప్పింది. ఈ దాడిలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, మంటలను వెంటనే ఫైర్ సిబ్బంది అదుపుచేసినట్టు అధికారులు చెప్పారు. చమురు కేంద్రాలకు సిబ్బంది, పౌరులు దూరంగా ఉండాలని హౌతీలు ప్రకటించిన కొద్ది సేపటికే ఈ దాడి జరిగింది.

దాడులు కొనసాగిస్తాం..

చమురు సంస్థలు తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని.. అందుకే తమకు అవి దాడి చేసే లక్ష్యాలుగా ఉన్నట్టు హౌతీలు చెప్పారు. సౌదీలోని ఎయిర్‌పోర్టులు, చమురు కేంద్ర సంస్థలపై దాడులను కొనసాగిస్తామని హెచ్చరించారు. యెమెన్ మీద సౌదీ దాడులు ఆపకపోతే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని.. సాధారణ పౌరులు తాము ఎంచుకున్న లక్ష్యాలకు దూరంగా ఉండాలని హౌతీలు కోరారు.

బయటకు రాకండి..

సౌదీలో వైమానిక దాడులు జరిగే సమయంలో ఇండ్లలోనే ఉండాలని, బయటకు రావొద్దని సౌదీలోని భారత ఎంబసీ సూచించింది. ఎంబసీ అధికారులు జారీచేసే హెచ్చరికలు, సూచనలు పాటించాలని చెప్పింది. దాడులకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేయొద్దని తెలిపింది. ఎలాంటి సహాయం కావాలన్నా ఎంబసీకి కాల్ చేసి చెప్పాలని కోరింది. సౌదీ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నామని చెప్పింది.

జర్మనీలో అగ్నిప్రమాదం.. భారతీయుల మృతి

బోచుమ్ (జర్మనీ), (వార్త సంధ్య)అక్టోబర్ 14.
జర్మనీలోని బోచుమ్ నగరంలో హోస్ట్‌ఫెడ్ ప్రాంతంలో మంగళవారం ఒక నివాస భవనంలో అనుమానాస్పద స్థితిలో జరిగిన అగ్నిప్రమాదంలో మూడో అంతస్తులోని ముగ్గురు భారతీయులు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. ఇది హత్యగా అనుమానించిన పోలీసులు అదే భవనంలో నివసిస్తున్న 41 ఏండ్ల వ్యక్తిని అరెస్ట్ చేశారు. అయితే మృతుల, క్షతగాత్రుల వివరాలను అధికారులు వెల్లడించ లేదు. అరెస్టయిన వ్యక్తి రొమేనియా దేశస్తుడని మీడియా తెలిపింది.

అజర్‌బైజాన్ బడుల్లో
హిజాబ్‌పై నిషేధం!

బాకు, (వార్త సంధ్య)అక్టోబర్ 14.
: దేశంలో 96 శాతం ముస్లిం జనాభా ఉన్నప్పటికీ పాఠశాలల్లో విద్యార్థుల డ్రెస్‌కోడ్‌లో మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయంపై మండిపడ్డ విద్యార్థినులు తరగతులు బహిష్కరించి నిరసనలు జరిపారు'హిజాబ్ పాపం కాదు.. ఒక దేవదూత' అని నినాదాలు చేశారు. అజర్‌బైజాన్ జనాభాలో 96 శాతం ముస్లింలు, వీరిలో షియాలు మెజారిటీ కాగా, సున్నీలు కూడా అధికంగానే ఉంటారు. అయినప్పటికీ తమది లౌకిక దేశంగా అజర్‌బైజాన్ ప్రకటించుకుంది.

బాలికపై రోబో లైంగిక వేధింపులు!



కొలోన్ : (వార్త సంధ్య)అక్టోబర్ 14.
ఒక రోబో 16 ఏండ్ల బాలికను తడిమి లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన జర్మనీలోని కొలోన్‌లో శనివారం చోటుచేసుకుంది. ఈ రోబో పోలీసుల అదుపులో ఉంది. నాలుగు అడుగుల ఎత్తున్న ఈ హ్యూమనాయిడ్ రోబో బాలిక వెనుక ఆమెను తడమడమే కాక, అసభ్య కదలికలు చేసింది. ఈ రోబోను రిమోట్ ద్వారా నియంత్రిస్తున్న ఇద్దరు బాలురు ఈ దృశ్యాన్ని లైవ్ స్ట్రీమింగ్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.దీంతో పోలీసులు రోబోతో పాటు 16, 19 ఏండ్ల ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. స్నేహితులతో వచ్చిన ఆ అమ్మాయి పామ్‌స్ట్రాస్‌లోని ఒక ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్‌లో ఉండగా ఈ ఘటన జరిగింది. ఆ బాలికపై ఉద్దేశపూర్వకంగా రోబోతో లైంగిక వేధింపులకు ప్రయత్నించారా అన్న విషయాన్ని దర్యాప్తు చేస్తున్నామని వారు చెప్పారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

విజయ్ దేవరకొండ 'రణబాలి'
అడ్వాన్స్ బుకింగ్స్ షురూ.!

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, సెన్సేషనల్ హీరోయిన్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విడుదల తేదీ సమీపిస్తున్న తరుణంలో చిత్ర యూనిట్ అభిమానులకు అదిరిపోయే అప్డేట్ అందించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రానికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ అధికారికంగా ప్రారంభమయ్యాయి.టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రాయలసీమ నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇక ఈ చిత్రానికి ప్రముఖ సంగీత ద్వయం అజయ్ -- అతుల్ అదిరిపోయే మ్యూజిక్ అందిస్తుండగా, హాలీవుడ్ ప్రముఖ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఈ సినిమాలో ప్రతినాయకుడిగా నటిస్తుండటం విశేషం. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు, సింగిల్ స్క్రీన్‌లు మరియు మల్టీప్లెక్స్‌లలో రణబాలి అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా తెలుగు వెర్షన్‌కు సంబంధించి ప్రీ-సేల్స్ ఊపందుకున్నాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు, ఓవర్సీస్‌లో తొలి రోజు కేవలం తెలుగు వెర్షన్ మాత్రమే గ్రాండ్‌గా విడుదలవుతుండగా, ఇతర భాషల డబ్బింగ్ వెర్షన్లు అక్టోబర్ 23న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. సినిమాకు హైప్ విపరీతంగా ఉండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ రాబట్టే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అక్టోబర్ 16, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

'కల్కి 2' సెట్స్‌లోకి రెబల్ స్టార్ ప్రభాస్..
త్వరలో ప్రారంభం కానున్న భారీ షెడ్యూల్!

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ సీక్వెల్ చిత్రం 'కల్కి 2898 ఏడీ -- పార్ట్ 2' షూటింగ్‌కు సంబంధించి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ పౌరాణిక చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి భాగం ఘనవిజయం సాధించడంతో, దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సీక్వెల్‌ను మరింత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన తదుపరి షెడ్యూల్ మరియు షూటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి.అయితే ప్రభాస్ రేపటినుంచి ఈ సినిమా షూటింగ్ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తుంది. ప్రభాస్ తన కీలక సన్నివేశాల షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి దిగ్గజ నటులు నటిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను 2027 నాటికి పూర్తి చేసి, భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రభాస్ కొత్త షెడ్యూల్ అప్‌డేట్‌తో ఆయన అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.



చైతూతో పెళ్లి తర్వాత ఆ విషయంలో నా ఆలోచ విధానం మారింది..

టాలీవుడ్ స్టార్ నాగచైతన్య సతీమణి శోభిత ధూళిపాళకు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందన్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె అక్కినేని వారసుడు, స్టార్ హీరో నాగచైతన్యతో ప్రేమ, వివాహం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అలాగే పెళ్లి తర్వాత తన ఆలోచన విధానం మారిందంటూ ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ఒక నటుడితో ప్రేమలో పడడంపై తన పాత అభిప్రాయాలు ఎలా మారాయో అనే విషయాలను మనసు విప్పి చెప్పారు. నటీనటులతో ఎప్పటికీ డేటింగ్ చేయబోనని కెరీర్ ఆరంభంలో చెప్పిన ఆమె ఇప్పుడు అదే కామెంట్స్ పై రియాక్ట్ అయ్యారు. 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో శోభిత తన వైవాహిక బంధం గురించి స్పందించారు. సంవత్సరాలు గడిచేకొద్దీ తన ఆలోచనా విధానం ఎలా మారిందో వివరించారు. తన వృత్తికి చెందిన వారితో డేటింగ్ చేయాలనుకోవడం లేదని 2016లో తాను చేసిన వ్యాఖ్యను గుర్తుచేసుకున్నారు."బహుశా నా చుట్టూ నేను చూసిన ఉదాహరణల వల్లేనేమో ఆ సమయంలో నేను ఒక మూసలో ఇరుక్కుపోయాను. అప్పుడు నా ఆలోచనా విధానం సంకుచితంగా ఉండి ఉంటుంది." అని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు నమ్మారన్న కారణంతో ఒకే అభిప్రాయాలకు అంటిపెట్టుకుని ఉండకుండా, వయసు పెరిగే కొద్దీ విషయాలను భిన్నంగా చూసేందుకు ప్రజలు సుముఖంగా ఉండాలని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. "తమ అభిప్రాయాలను మార్చుకోని వారిని చూస్తే నాకు ఎక్కువ భయం. వేర్వేరు సమయాల్లో వేర్వేరు అభిప్రాయాలు కలిగి ఉండటంలో నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. నేను పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోవడానికి సిద్ధంగా ఉన్నాను" అని ఆమె అన్నారు.అలాగే నాగ చైతన్యతో వివాహం తర్వాత వ్యక్తిగత జీవితంపై పెరిగిన పబ్లిక్ ఫోకస్, సోషల్ మీడియా చర్చలపై ఆమె స్పందించారు. ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు ఎప్పటికప్పుడు మారుతుంటాయని.. వాటితో అతిగా మమేకమైతే మన సొంత అస్తిత్వాన్ని కోల్పోతామని అన్నారు. "సమాజం వాతావరణం లాంటిది. అది వస్తూ పోతూ ఉంటుంది. మీరు ఆ వాతావరణంతోనే ఎక్కువగా మమేకమైతే, వాతావరణం మారినప్పుడు మీరు దారి తప్పిపోతారు. కాబట్టి, స్థిరంగా ఉంటూ, వాస్తవికత ఏమిటో గమనిస్తూ ఉండటం ముఖ్యం అని నేను అనుకుంటున్నాను. ఆ విషయం తెలుసుకునే అదృష్టం నాకు కలిగిందని భావిస్తున్నాను. స్థిరంగా ఉండటం అనేది మీరు తీసుకునే ఒక నిర్ణయం" అని ఆమె అన్నారు.

'కల్ట్' వాయిదా పడినట్టేనా ..

- విశ్వక్ సేన్ సినిమా రిలీజ్‌పై ఇంకా రాని క్లారిటీ!

టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ నటుడిగానే కాకుండా దర్శకుడిగానూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న క్రేజీ థ్రిల్లర్ చిత్రం 'కల్ట్' పై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా భారతీయ తెరపై స్లాషర్ థ్రిల్లర్‌గా, 'ఏ' సర్టిఫికెట్‌తో కూడిన చిత్రంగా దీన్ని పరిచయం చేయడంతో ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగాయి. అయితే అక్టోబర్ నెలాఖరులో విడుదల చేస్తామని గతంలో ప్రకటించిన ఈ సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్స్ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. 'కల్ట్' సినిమాను అక్టోబర్ చివరి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్రబృందం గతంలో వెల్లడించింది. ఈ నెల ప్రారంభంలో ఓ అప్‌డేట్ ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత సినిమా గురించి పెద్దగా సమాచారం బయటకు రాలేదు.సాధారణంగా విడుదలకు దగ్గరపడుతున్న సినిమాలకు ప్రమోషన్లు, పోస్టర్లు, టీజర్లు లేదా ట్రైలర్లతో సందడి మొదలవుతుంది. కానీ 'కల్ట్' విషయంలో అలాంటి హడావుడి కనిపించకపోవడంతో సినిమా అనుకున్న సమయానికి విడుదలవుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అక్టోబర్ నెలలో ఇప్పటికే సగానికి పైగా సమయం గడిచిపోయింది. అయినప్పటికీ విడుదల తేదీపై స్పష్టత లేకపోవడం, ప్రచార కార్యక్రమాలు ప్రారంభం కాకపోవడం వాయిదా వార్తలకు ఊతమిస్తోంది. అయితే సినిమా వాయిదా పడినట్లు ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో విడుదల తేదీపై చిత్రబృందం నుంచి వచ్చే తదుపరి అప్‌డేట్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. విశ్వక్ సేన్ తన సినిమాల్లో విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. 'కల్ట్'తో ఆయన మరోసారి దర్శకత్వ బాధ్యతలు చేపట్టడం విశేషం. స్లాషర్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా, దాని కథాంశం మరియు చిత్రీకరణ శైలి కారణంగా ఇప్పటికే సినీ వర్గాల్లో చర్చకు వచ్చింది.ఈ చిత్రంలో గాయత్రి భరద్వాజ్, మురళీ శర్మ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తారక్ సినిమాస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. కథ, పాత్రలు, హింసాత్మక సన్నివేశాల నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించిన ప్రకటనలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. అయితే 'కల్ట్' విడుదలపై నెలకొన్న సందిగ్ధతకు చిత్రబృందం అధికారిక ప్రకటనతోనే తెరపడనుంది

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.